


# చిత్రవధ

(రెండు తెరల మధ్యనుంచి ప్రొడ్యూసర్ రంగస్థలంమీదికి వస్తాడు. ఒక అడుగు ముందుకు వేసి ఫోర్‌స్టేజిమీద నిలబడి ప్రేక్షకులకు నమస్కారం చేస్తాడు.)

ప్రొడ్యూసర్: ప్రేక్షక మహాశయులకు నమస్కారం! నేను ఈ నాటకానికి ప్రొడ్యూసర్ని. నాటకం ప్రారంభించడానికి ముందు నేను తమకు కొన్ని సంగతులు మనవి చెయ్యవలసి ఉంది. ఈనాడు మన ఆంధ్రదేశంలో నాటకరంగం పూర్తిగా పునాదులతో సహా కూలిపోయింది. ఎక్కడో అడపాదడపా ఒకటో అరో నాటకం వేస్తే చూడానికి జనం రావడంలేదు. వచ్చిన వాళ్లు కాస్తా మధ్యలో లేచి చక్కా పోతున్నారు. నాటకరంగం ఇంత నీరసంగాను, నిస్సారంగాను తయారవడానికి కారణం ఏమిటి? అది రచయితలలో ఉన్న లోపమా? నటులలో లోపమా? ప్రేక్షకులలో లోపమా? అని దీర్ఘంగా ఆలోచించాను. ఇది ప్రేక్షకుల లోటు ఎంతమాత్రం కాదని, నటుల తప్పుకూడా ఇందులో లేదని నేను ఒక నిశ్చయానికి వచ్చాను. నాటకరంగం నశించిపోవడానికి బాధ్యత పూర్తిగా నాటకకర్తదే. కారణం ఏమిటంటారా? ప్రజల అభిరుచికి అనుకూలంగా నాటక కర్త నాటకం రాయడు. సినిమాలు శతదినోత్సవాలు చేసుకోడానికి కారణం ఏమిటి? సినిమాలు ప్రజలకు దగ్గరగా పోతూఉంటే నాటకాలు రోజురోజుకూ ప్రజలకు దూరంగా ఎందుకు పోతున్నాయి? ఇవన్నీ ఆలోచించిన మీదట నేను ఈ నాటక రచయితను పట్టుకున్నాను. నాటికి నూరుపాళ్లు సినిమాకు సరిపోయే నాటకం రాసి ఇవ్వమని

అడిగాను. సినిమాలను గురించి ఈ రచయితకు ఆట్టే తెలియదు. అందుచేత నేనే స్వయంగా శతదినోత్సవాలు చేసుకున్న సినిమాల తాలూకు కథలన్నీ ఆయనకు చెప్పాను. వీనన్నిటికీ మించి నాటకం రాయించాను. నాటకానికి రచయిత పెట్టిన పేరు 'చిత్రకథ'. ఆ తరువాత ఓ చిన్న ప్రమాదం జరిగింది. వేసర్ను అప్పుడు ఇచ్చాం. ప్రూఫ్ రీడర్‌గా మా నాటకందలోని విలన్ అనగా దుష్ట పాత్రధారిని పంపాం. అతను స్వయంగా ప్రూఫ్లు చూసి రెండువేల కర పత్రాలు అచ్చు కొట్టించుకు వచ్చాడు. తీరా చూస్తే ఇంకేముంది? 'చిత్రకథ' కాస్తా 'చిత్రవధ'గా అచ్చయింది. అదరాబాదరా నేను అచ్చాఫీసుకు పరిగెత్తాను. ఫలితం లేకపోయింది. తిరిగి నాటక రచయిత ఇంటికి వెళ్ళాను. జరిగిన ప్రమాదం చెప్పాను. కర పత్రం చూడగానే రచయిత కళ్ళు పూర్తిగా తెరుచుకున్నాయి. ఆనందపరవశుడైపోయాడు. కంపోజిటర్ ప్రతిభ మెచ్చుకున్నాడు. అప్పుడే రేడియో కేంద్రం నుంచి ఆయనకు వచ్చిన రాయల్టీ డబ్బు తొమ్మిది రూపాయలు ... అయిదు పైసలు నా చేతికి ఇచ్చి కంపోజిటర్‌కు బహూకరించమన్నాడు. ... తిరిగి అచ్చాఫీసుకు వెళ్ళాను. కానీ మేనేజరుకు కోపం వచ్చింది. "కంపోజిటరుకు మీరు బహుమతి ఇస్తే, రేపటినుంచి అతగాడు అచ్చు తప్పులు విపరీతంగా పెంచగలడనీ, తప్పుల్ని ప్రోత్సహించడానికి వీల్లేదనీ ప్రెస్ మేనేజరు నా కోరిక నిరాకరించాడు. ఇది 'చిత్రవధ' వెనక ఉన్న కథ. ఇక అసలు కథలోకి వద్దాం. సినిమా కథలో రాయబడిన ఈ నాటకం మీకు పూర్తిగా నచ్చితీరుతుందనడంలో నాకు సందేహం లేదు. ఈ నాటకానికి శతదినోత్సవం జరిపించమని మిమ్మల్ని ప్రార్థిస్తున్నాను. కథలో సెంటిమెంటుకు ప్రాధాన్యం ఉంది. మరొక చిన్న మనవి. ఈ నాటకంలో నాయికా నాయకుల యుగళగీతం ఒకటి ఉంది. సినిమా సాహిత్యంలోని పదికట్టు రాళ్ళలాంటి మాటలు కొన్ని నేనే స్వయంగా ఏరి రచయితకు ఇచ్చి పాట రాయించాను. తుదిరిస్టు, హార్మోనిస్టుల సౌకర్యార్థం పాటలో అర్థం కంటే ధ్వనికే ప్రాధాన్యం ఇవ్వవలసి వచ్చింది. అందుచేత సారస్వతప్రియులైన ప్రేక్షకులను పాటలోని అర్థం కోసం వెతకకుండా కేవలం పాటమాత్రమే విని ఆనందించమని కోరుతున్నాను. కొన్ని పద్యాలు కూడా ఉన్నాయి. పదాలలో మాత్రం మీరు నిరభ్యంతరంగా అర్థం వెతుక్కోవచ్చు. సంభాషణలలో యమకం కూడా ఎక్కువ పెట్టించాను. ఈ నాటకం తను మన్నన పొంది విజయవంత మయితే, అతి త్వరలోనే ఒక అపరాధ పరిశోధక నాటకం, ఒక స్టంటు నాటకం కూడా సమర్పించగలనని తమకు మనవి చేసి సెలవు పుచ్చుకుంటున్నాను. దయ చేసి నిశ్శబ్దంగా నాటకం చూడమని కోరు

పాత్రలు:

1. ప్రొడ్యూసర్
2. రాజా
3. సరోజ
4. చంద్రం
5. రామ్మూర్తి
6. మోహన
7. రంగ
8. కిష్టయ్య

---

ఉన్నాడు.

( వచ్చిన దారినే ప్రొడ్యూసర్ తిరిగి లోపలికి వెళ్ళిపోతాడు. రంగస్థలం ఒక్కసారి చీకటితో నిండిపోతుంది. తిరిగి దీపాలు వెలిగేసరికి ఒక హాలు కనిపిస్తుంది. హాలుకు మధ్య ఒక ద్వారం కనిపిస్తుంది. ఇంట్లోంచి వచ్చే వాళ్ళంతా మధ్య ద్వారానికి ఉన్న డోర్ కర్టెన్ తొలగించి హాలులోకి వస్తూ ఉంటారు. కుడివైపు ద్వారం వీధిలోకి, ఎడమవైపు ద్వారం గదిలోకి మార్గాన్ని సూచిస్తూ ఉంటాయి. హాలులో ఎడమవైపు ఒక పెద్ద టేబులు, మూడు కుర్చీలు ఉన్నాయి. కుడివైపు ద్వారానికి దగ్గరగా చిన్న స్టూలుమీద కిష్టయ్య కూర్చుని ఏదో పుస్తకం పైజేబులో ఉన్న డిటెక్టివ్ నవల చదువుతూ ఉంటాడు. వయస్సు 22 లోపు. కుడివైపునుంచి ఆకస్మాత్తుగా చంద్రం ప్రవేశిస్తాడు. వయస్సు 30. అతని చేతిలో జిప్ బేగ్ ఉంటుంది. )

చంద్రం: ( వస్తూనే బిగ్గరగా ) ఒరేయ్!

కిష్టయ్య: ( ఉలిక్కిపడి ఒక్కసారిగా భయంతో ) బాబోయ్! ( పుస్తకం కింద పారేసి లేచి నిలబడతాడు. )

చంద్రం: ( కోపంతో ) ఎందుకురా అలా అరుస్తావ్?

కిష్టయ్య: మీరటండీ చంద్రంగారూ! ఇంకా నా గుండెలు కొట్టుకుంటున్నాయి.

చంద్రం: ఎందుకురా? ఏమయింది?

కిష్ట: ( కిందపడిన పుస్తకం తీసి చూపిస్తూ ) ఇదుగో, ఈ పుస్తకం చూశారూ? ఇది 'శవచరిత్ర!' హంతకుడు శశిరేఖ గదిలో మత్తుమందు సీసాతోను, కత్తితోను ప్రవేశిస్తున్నాడు. ఊపిరి బిగబట్టి నేను చదువుతున్నాను. అంతలో మీరు అమాంతంగా రావడంతో హడిలిపోయాను!

చంద్రం: ( కోపంతో ) ఏడవలేకపోయావు, వెధవ పుస్తకం నువ్వూను. నేను నీకు చెప్పిందేమిటి? నువ్వు చేస్తున్న దేమిటి?

కిష్టయ్య: మీరు చెప్పినట్టు నేను అనుమానం వాళ్ళ మీదే కన్నేసి ఉంచితే వాళ్ళు నన్ను అనుమా

**అంగర సూర్యారావు**

---



నించరూ? అందేత మధ్య మధ్యని....

చంద్రం: ( మాట మధ్యలో చిరాకుతో ) ఇక చాలించు, వాళ్ళంతా లోపల ఉన్నారా? లేకపోతే షికారు పోయారా?

కిష్టయ్య: పుకార్లకు జడిసి షికార్లు వెళ్ళడం లేదు సార్.

చంద్రం: వెళ్ళు. అయితే చప్పున వెళ్ళు!

కిష్టయ్య: ఎక్కడికి?

చంద్రం: లోపలికి వెళ్ళి రామ్మూర్తిగారిని అర్జంటుగా రమ్మని చెప్పు.

కిష్టయ్య: ( తెలగ్గా ) అలాగే... ( లోపలికి వెళుతూ ఉంటాడు. )

చంద్రం: ( రహస్యంగా ) ఒరేయ్, కిష్టయ్యా!

కిష్టయ్య: ( ఆగిపోయి ) అయ్యా!

చంద్రం: ( అతనిని సమీపించి ) నువ్వుమాత్రం రామ్మూర్తితో కలిసి రాకు. లోపలే ఉండు. ( ఒక్కసారి చుట్టూ చూసి ) సరోజ ఇక్కడికి రాకుండా చూడు.

కిష్టయ్య: అంటే మీరు తిరిగి వెళ్ళిపోయేదాకా ఇక్కడకు రాకుండా చెయ్యమంటారా?

చంద్రం: రామ్మూర్తి, నేనూ కొన్ని రహస్యాలు మాట్లాడాలి. మేం మాట్లాడుతున్నప్పుడు మాత్రం సరోజ రాకుండా చూడాలి, అంతే!

కిష్టయ్య: ( సంతోషంతో ) అంతేనా! అంతేనా! మరేం ఫర్వాలేదు. ఆ పూచీ నాది. మీరు నిశ్చింతగా కూర్చోండి గురూగారూ!

( కిష్టయ్య మధ్యద్వారంలోనుంచి లోపలికి వెళ్ళిపోతాడు. లోపలనుంచి హార్మోనియం, తబలా వాయిద్యాలు వినిపిస్తూ ఉంటాయి. చంద్రం కుర్చీలో కూర్చుని చూస్తూ ఉంటాడు. ఆ సమయంలో కర్టెన్ తొలగించుకొని లోపలి నుంచి రామ్మూర్తి వస్తాడు. వయస్సు 50. పల్లకోటు. పంచెకట్టు. ఒత్తుగా ఉన్న మీసం. )

రామ్మూర్తి: ( వస్తూనే ) ఎంతకాలానికి వచ్చావోయ్ చంద్రం!

చంద్రం: వారం రోజులే కదండీ అయింది!

రామ్మూర్తి: ( బాధగా ) అవును నాయనా! నీకు వారం రోజులంటే తక్కువకాలం. నాకు ఒక రోజు ఒక యుగంలా ఉంది. ఎంత బరువు! ఎంత బాధ! చుట్టూ అప్పులవాళ్ళు! లాయరు నోటీసులు ఇచ్చినవాళ్ళు కొందరు. సంవత్సరాలనుంచి నన్ను కోర్టుకు ఈడుస్తున్నవాళ్ళు కొందరు. కోర్టులో డిక్రీ పొంది కోర్టు అమీనాతో సహా ఇంటిచుట్టూ గద్దల్లా తిరుగుతున్నవాళ్ళు కొందరు!

చంద్రం: ( ఒక్కసారిగా ) రామ్మూర్తిగారూ! ఈ నేటితో మీ బాధలన్నీ గట్టెక్కిపోయినట్టు లెక్క.

రామ్మూర్తి: ( నమ్మలేక ) ఏమిటి నాయనా, నమ్మశక్యంగా లేదు ఏమిటి? ... ఏమిటి నాయనా, నవ్వుతున్నది?

చంద్రం: ( ప్రతిమాట నొక్కినొక్కి చెబుతూ ) ఈ రోజుతో మీ బాధలన్నీ తీరిపోయాయని చెబుతున్నాను, రామ్మూర్తిగారూ! ( తన చేతి

# ఆ రోజుకోసం

## పరవస్తు సుందర్

అందరిలా నేనూ పుట్టాను,
ఈ లోకంలో అడుగు పెట్టాను.
అసూయాద్వేషాల పరిధిలో
దారిద్ర్యపు దావానలం నీడల్లో
ప్రయాసతో మగ్గుతున్న ఆ ఒడిలో
పుట్టాను అందరిలా ఆనాడు నేను.

ఆ ఒడిలో వెచ్చదనం చవిచూడక
ఆ పిలుపులోని ఆనందం అనుభవించక
విసుగు, విదిలింపుల మాటున
బరువుగా, ఒకరికి భారంగా,
అసూయాద్వేషాలు చల్లని, అనురాగపు
ఊరడింపులతో
పెరుగుతున్నాను ఈనాటికీ.
అందరిలా పుట్టిన నేను.

నలుదిక్కులా ముసురుకున్నాయి చీకట్లు.
ఏదైనా జ్యోతి ఆధారం కావాలి.
ఏది? ఆశాజ్యోతా?
ఈ చీకటి జీవులకు ఆ జ్యోతి కని
పించదు.
పైగా మిగులుతుంది నిరాశ!
కానీ కావాలి ఆ ఆశ.
బ్రతకాలి దానికోసమైనా.

ఈ చీకటి బ్రతుకులో
వెలిగే మిణుగురు పురుగులాంటి
ఆ ఆశ,
ఏనాడో తప్పకుండా
ఆరిపోతుందనే ఆశ,
శాశ్వతంగా ఆ చీకట్లో కలిసిపోతాననే ఆశ,
తప్పకుండా కావాలి నాకు
నిరీక్షిస్తాను ఆరోజుకోసం.

ఆనాడు ఈ చీకటి ఒడిలో
వెలిగించుకున్న ఈ చిరుజీవితపు
వెలుగు తరించి అంతరించే
మంచిరోజు కోసం
చూస్తూంటాను నేను.
అందరిలా ఈ లోకంలో పుట్టిన నేను! ★

లోని జిప్ బేగ్ తెరిచి, రెండు నోట్ల కట్టలు తీసి ) ఇవిగో పదివేల రూపాయలు !

( నోట్ల కట్టలు రామ్మూర్తికి ఇస్తున్న సమయంలో డోర్ కర్టెన్‌లోనించి తల ఇవతలకు పెట్టి కిష్టయ్య రహస్యంగా చూస్తాడు. చంద్రం కోపంతో అటు చూసే సరికి కిష్టయ్య తల మాయమౌతుంది. )

రామ్మూర్తి: ( ఆనందపారవశ్యంతో ) నాయనా, చంద్రం! మనిషివంటే నువ్వు! సరిగ్గా సకాలంలో ఉపకారం అందుకొన్నావు నన్ను! అవతల అప్పులవాళ్లు. ఇవతల పెళ్లికాని పిల్ల. పెళ్లికొడుకులంతా "వేలకువేలు కట్నాలు ఇస్తేకాని పెళ్లిచేసుకోం" అంటూ భీష్మించుకుని కూర్చుంటున్న కాలం! ఇలాంటి కాలంలో నువ్వు కట్నం కోరకుండా పెళ్లిచేసుకోడానికి ఒప్పుకున్నావు. పైగా పదివేల రూపాయలు నువ్వే ఎదురు తిరిగి నాకు ఇస్తున్నావు. నన్ను ఋణవిముక్తుణ్ణి చేస్తున్నావు! నీ త్యాగం గొప్పది. చెప్పడానికి మాటలు చాలవు!

చంద్రం: రామ్మూర్తిగారూ, పదివేలు సహాయం అంటే చాలా చిన్న విషయం! మీరు నన్ను అందలం ఎక్కించ నక్కర్లేదు. ఆనందిస్తే చాలు!

రామ్మూర్తి: ( సంతోషంతో ) ఇది ఎంత శుభదినం! సరోజకు ఈ శుభవార్త చెప్పి ఇప్పుడే వస్తాను. ( లోపలికి వెళ్లబోతాడు. )

చంద్రం: ఆగండి. ( రామ్మూర్తి వెనక్కి తిరిగివస్తాడు. ) చూడండి, మీ అమ్మాయి ఇంకా విచారంగానే ఉన్నట్టు కనిపిస్తోంది...

రామ్మూర్తి: అవ్వే, చాలావరకూ తగ్గిపోయిందనుకో. మరో నెల రోజులకు విచారం పూర్తిగా కట్టేస్తుంది.

చంద్రం: నాకు కొన్ని అనుమానాలు ఉన్నాయి రామ్మూర్తి గారూ!

రామ్మూర్తి: ( ఒక్కసారిగా నిర్ఘాంతపడి ) అదేమిటోయ్! అనుమానం ఏమిటి? ( కుర్చీలో కూలబడి ) ఎందుకు అనుమానం? ఎవరిమీద అనుమానం?

చంద్రం: మీరు గుక్కతిప్పకుండా అన్ని ప్రశ్నలు వేస్తే ఎలా చెప్పండి?

రామ్మూర్తి: మామూలుగా తాపీగా చెప్పవోయ్. కాఫీ తెప్పించమంటావేమిటి? ( అటుతిరిగి ) ఒరేయ్ కిష్టయ్యా!

కిష్టయ్య: ( తక్షణం డోర్ కర్టెన్‌లోంచి తల ఇవతల పెట్టి ) అయ్యా! కాఫీ పట్టుకు రమ్మని సెలవా?

చంద్రం: ( నిస్పృహతో ) హరి దౌర్భాగ్యుడా! మా మాటలన్నీ నువ్వు వింటున్నావా?

కిష్టయ్య: ( తత్తరపాటుతో ) లే... లేదు సార్!

చంద్రం: ( కోపంతో ) పో ... పోరా లోపలికి! ( కిష్టయ్య లోపలికి వెళ్లిన తరవాత ) రామ్మూర్తిగారూ, మీ అమ్మాయికి రాజామీద ఎందుకంత మమకారం?

రామ్మూర్తి: మమకారం అనేది ఉంది చూశావూ, అది ఒక రకమైన మానసిక వికారం! దానికి కారణం నేనూ చెప్పలేను, నువ్వూ చెప్పలేవు.

చంద్రం: నాకు కావలసింది వేదాంతం కాదు.

రామ్మూర్తి: నేను చెప్పింది వేదాంతం కాదోయ్! అది సిద్ధాంతం!

చంద్రం: ( తీవ్రంగా ) సిద్ధాంతం రాద్ధాంతం విడిచి పెట్టండి రామ్మూర్తిగారూ! అసలు సంగతి తేల్చండి.

రామ్మూర్తి: తేల్చడాని కేముంది? రాజాను చూస్తే నాకు మొదటినుంచీ కిట్టేది కాదు. మా అమ్మాయిమాత్రం వాణ్ణి చూడకుండా ఉండ లేకపోయేది. పాపం! రాజా అప్పులపాలై దేశాలు పట్టిపోయాడు. చివరికి దూరదేశంలో ఎక్కడో ప్రాణం వదిలేసినట్టు వర్తమానం వచ్చింది. చచ్చినవాడిమీద ఎంత అభిమానం ఉన్నా వచ్చిన నష్టం ఏముంది?

చంద్రం: ఎందుకు లేదూ? చాలా నష్టం ఉంది. ఇరవై నాలుగు గంటలూ చచ్చినవాణ్ణే తలుచుకు కూర్చుంటే, బ్రతికిఉన్న భర్తకు ఎలా ఉంటుంది?

రామ్మూర్తి: మరేం ఫరవాలేదు. మరిచిపోతుంది.

చంద్రం: ( కోపంతో ) ఎవణ్ణి మరిచిపోతుంది? బ్రతికినవాణ్ణా? చచ్చినవాణ్ణా?

రామ్మూర్తి: చచ్చినవాణ్ణేనోయ్! నవ్వచెప్పలేక చస్తున్నాను. ఇదుగో అబ్బాయ్, నువ్వు చిన్నవాడివి. ఇలాంటి పనికిరాని సంగతులన్నీ బుర్రకు పట్టించుకోకూడదు. ఇంతకూ రాజా చచ్చిపోయి ఎంతకాలం అయింది? ఒకే ఒక నెల! మరో రెండు నెలలు తిరిగేసరికి పూర్తిగా మరిచిపోతుంది. అప్పుడు మీ పెళ్లి మీ ఉభయుల ఇష్టప్రకారం జరిపించే పూచీ నాది.

చంద్రం: మూడు నెలల్లో పెళ్లి జరిపిస్తామంటున్నారు మీరు. కాని మీరు చేస్తున్న ప్రయత్నాలు చూస్తుంటే, మూడేళ్లకు కూడా పెళ్లి చేయించే ఉద్దేశం మీకు లేదని తెలుస్తోంది.

రామ్మూర్తి: ( ఆశ్చర్యంతో ) అదేమిటోయ్? ఈ సారి నీ అనుమానం నామీదకే మళ్లిపోయిందేమిటి?

చంద్రం: ( బిగ్గరగా ) అనుమానం కాదండీ. నిదర్శనం ఉంది. ( జిప్ బాగ్ చర్రున తెరిచి దానిలోంచి న్యూస్ పేపరు తీసి ) ఈ పేపరులో మీరు వేయించిన ప్రకటనకు ఉద్దేశం ఏమిటి? చదువుతాను, వినండి.

రామ్మూర్తి: చదవక్కర్లేదోయ్. ఆగు.

చంద్రం: ఆదేమన్నమాట! నేను చదివి తీరతాను. మీరు వినితీరాలి. తప్పదు. ( ఆవేశంతో చదువుతాడు ) "ట్యూటరు కావలెను. ఇరవై ఏళ్ల యువతికి చదువు చెప్పుటకు ఉభయభాషా ప్రవీణుడు, అంటే ఆంగ్లంలోను హిందీలోను ప్రావీణ్యం పొందిన ఉపాధ్యాయుడు, కావలెను. తెలుగు భాషలో స్వల్పమైన ప్రవేశమున్నా చాలును. యువకులకు ప్రాధాన్యం ఇవ్వబడును. ఇట్లు రా. రామమూర్తి"— ( పేపరు టేబులు మీద పారేసి కోపంతో ) ఏమిటి? దీని అర్థం ఏమిటి?

రామ్మూర్తి: అర్థంలేదూ, తాత్పర్యం లేదూ. అసలు సంగతి తెలుసుంటే బోధపడుతుంది. అమ్మాయి విచారంలోంచి కోలుకోవాలంటావా? అక్కర్లేదా?

చంద్రం: అయితే?

రామ్మూర్తి: మనస్సు మళ్లించాలి. అందుకు చదువొక్కటే సక్రమ మార్గం. కాదంటావా?

చంద్రం: ఏం చదివిస్తారు?

రామ్మూర్తి: పి.యు.సి. పరీక్ష లోగడ పోయింది కదా! తిరిగి ఆ పరీక్షకే తయారవుతుంది.

చంద్రం: పి.యు.సి. చదివే రోజుల్లో మీ అమ్మాయి రాజాగాడితో కలిసి షికార్లు వెళ్ళేది. అందుకే పరీక్ష పోయింది.

రామ్మూర్తి: (కోపంతో) చాలు చాల్లేవోయ్. ఊరుకో. అసలు పి.యు.సి. కోర్సు ఉంది చూశావూ, దాన్ని ఏ మహానుభావుడు కనిపెట్టాడో, ఏ ముహూర్తంలో పెట్టారో కాని ఆ పరీక్షలో పోయినవాళ్లే హెచ్చు. అంతేకాని షికారాలా కావు, వికారాలా కావు.

చంద్రం: పోనీ, మాటవరసకి మీ మాట ఒప్పుకుంటాను. కానీ మీ ప్రకటనలో "యువకులకే ప్రాధాన్యం ఇవ్వబడును" అన్న మాటకు అర్థం ఏమిటి? (హేళనగా) యువతికి చదువు చెప్పడానికి యువకుడే కావాలా? వృద్ధుడు పనికిరాడా? (కోపంతో లేచి) మీరు చేసిన ప్రకటన ప్రైవేటు మాస్టరు కోసం చేసిన ప్రకటనా? లేకపోతే పెళ్లికొడుకు కోసం చేసిన ప్రకటనా?

రామ్మూర్తి: శాంతించవోయ్. కూర్చో! నువ్వు చిన్నవాడివి. నీకు మంచీ చెడ్డా తెలియావు. ప్రైవేటు మాస్టర్ల సంగతి నీకు తెలియదు. వయసులో ఉన్నవాడికంటే వయసు మళ్లినవాడికి డబ్బు మీద ఆశ ఎక్కువ ఉంటుంది. ఎక్కువ డబ్బు అడుగుతాడు. వాళ్లకు ఓపిక తక్కువ ఉండడం సహజం. అలాంటివాళ్ళు మన పట్నంలోనే వేలకొద్దీ ఉన్నారు.

చంద్రం: అయితే మన ఊరి ప్రైవేటు మాస్టరు పనికిరాడన్న మాట!

రామ్మూర్తి: పొరుగూరువాడైతే మరీ మంచిది.

(సరోజ మధ్యద్వారంనుంచి వస్తుంది. చంద్రాన్ని చూడగానే ఆమె ముఖం ముడుచుకుపోతుంది. నల్లటి చీర, నల్లటి జాకెట్ వేసుకొంది.)

సరోజ: (వస్తూనే తీవ్రంగా) నాన్నగారూ, మీరు నా ట్యూటరునుగురించి ఎవరికీ సంజాయిషీ ఇవ్వవలసిన అవసరం లేదు. అది మన స్వంత విషయం.

రామ్మూర్తి: అవునమ్మా! అది మన స్వంత వ్యవహారమే అనుకో. చంద్రం మనకు పరాయివాడా? రేపో మాపో మన స్వంత మనిషి కావలసినవాడు. చూడు. పాపం! నేను ఇబ్బందుల్లో ఉన్నానని తెలుసుకొని తనంతట తానే (నోట్ల కట్టలు తీసి చూపించి) పదివేల రూపాయలు సహాయం చేశాడమ్మా! పదివేలు!

సరోజ: (కోపంతో) ఓ! అదా సంగతి!

రామ్మూర్తి: (లేచి) కోప్పడకమ్మా! తాపీగా కూర్చో. చంద్రంతో మంచీ చెడ్డా మాట్లాడు. నేను లోపలికి వెళ్లి వస్తాను. (చేతిలో ఉన్న నోట్ల కట్టలకేసి వికసించిన ముఖంతో చూసి లోపలికి వెళ్లిపోతాడు.)

సరోజ: (తండ్రి నిష్క్రమించేవరకూ అటే చూసి, వెంటనే చంద్రంకేసి తిరిగి) చంద్రం, ఏమిటి నీ ఉద్దేశం?

చంద్రం: (ఒక్కసారిగా తెల్లబోయి) ఉద్దేశమా?

సరోజ: (గద్దించి) మా నాన్నకు పదివేలు ఇవ్వడంలో నీ ఉద్దేశం ఏమిటి?

చంద్రం: ఇదంతా నీకోసం. నీకోసమే సరోజా.

సరోజ: నన్ను డబ్బుతో కొందామని చూస్తున్నావా?

చంద్రం: (తీవ్రంగా) సరోజా! నువ్వు నన్ను అర్థం చేసుకోవడం లేదు.

సరోజ: (కోపంతో) చంద్రం, నేను నిన్ను పూర్తిగా అర్థం చేసుకున్నాను. ఈవేళ కాదు. ఏనాడో తెలుసుకున్నాను. రాజామా నన్నూ నీడలా వెంటాడావు నువ్వు. కాలం మూడేవరకూ కాకి వర్ణంలా కాచుకు కూర్చున్నావు. అసలే దిక్కు

> కన్యలు భర్తలను తప్పించి మరి దేనినీ కోరరు; భర్తలు లభించిన తరవాత సమస్తాన్నీ కోరతారు.
>
> —షేక్స్పియర్

అలో ఉన్న మా నాన్నగారి మెడకు ఉచ్చు తగిలించావు. పచ్చని సంసారంలో చిచ్చు పెట్టడానికి చూస్తున్నావు. మా నాన్నగారిమీద నిజంగా నీకు అభిమానం ఉందా? ఆయన మీద ప్రేమతో నువ్వు డబ్బిస్తున్నావా?

చంద్రం: లేదు. ఎంతమాత్రం లేదు. ఆయన ప్రేమతో నాకేం పని? నాక్కావలసింది నువ్వు. నీ ప్రేమ నాకు కావాలి.

సరోజ: అది కలలో మాట. నేను పరాధీనను. నా మనసు ఏనాడో ఇంకొకరికి అర్పించాను.

చంద్రం: ఎవరికి?

సరోజ: నన్నెందుకు బాధపెడతావు, చంద్రం? వెళ్లిపో. రాజాకు నా మనసిచ్చిన సంగతి నీకు తెలుసు. వెళ్లిపో.

చంద్రం: (తీవ్రంగా) వెళ్లడానికి నాకేమీ అభ్యంతరం లేదు, సరోజా! (లేచి) వెళతాను. కానీ నీ రాజా ఈ ప్రపంచంలో లేడన్న సంగతి నువ్వు గుర్తుంచుకో.

సరోజ: (బాధగా) జీవించినా, మరణించినా అతనే నా భర్త.

చంద్రం: (ఒక్కసారిగా) ఏమిటన్నావ్! భర్తా? వాడు నీకు భర్తా? పెళ్లికానిదే భర్త ఎలా అవుతాడు?

సరోజ: (నిష్ఫూరంతో నవ్వి) పెళ్లంటే ఏమిటి చంద్రం? కేవలం పాణిగ్రహణం, అంటే చేతులు కలయిక ఒక్కటే పెళ్లి అనుకుంటున్నావా చంద్రం? మనస్సులు కలిసినదే నిజమైన పెళ్ళి.

చంద్రం: (కోపంతో) ఇక చాలించు నీ వేదాంతం. పెళ్లి కాకుండా పరాయివాణ్ణి భర్త అంటే చట్టం ఒప్పుకోదు. పోలీసులు పట్టుకుంటారు. అవినీతి కేసు బనాయిస్తారు. కోర్టు జుర్మానా వేస్తుంది. వాడి ధర్మమా అని వాడు చచ్చి ఊరుకున్నాడు కనక చిక్కు లేకపోయింది. బాగా ఆలోచించు. వాడు నీ కెంతమాత్రం భర్త కాడు.

సరోజ: నువ్వెంత చెప్పినా నా మనసు మారదు. ముమ్మాటికీ అతడే నా భర్త. జన్మజన్మలకూ విడరాని బంధం!

చంద్రం: (హేళనగా) ఎన్ని జన్మలకైనా అతడే నీ భర్తంటావు. అంతేనా? (సరోజ కోపంతో చూస్తుంది) ఇక ఈ జన్మలో పెళ్ళే చేసుకోవా? (పరిశీలనగా చూసి పరవశత్వంతో) కాని సరోజా! ఈ నల్ల చీర నీకు ఎంత అందంగా ఉందనుకున్నావు! (ఆమెను సమీపించి) నిన్ను చూస్తూ ఉంటే నా మనసు స్వాధీనం తప్పుతూంది సరోజా! (భుజంమీద చెయ్యి వెయ్యబోతాడు.)

సరోజ: (వెనక్కి అడుగువేసి కోపంతో) దూరంగా ఉండు!

చంద్రం: (మరింత దగ్గరగా వచ్చి) స...రో...జా!

సరోజ: (కోపావేశంతో) మర్యాదగా వెళతావా, లేకపోతే బయటికి గెంటించమంటావా? (వెనక్కి తిరిగి) కిష్టయ్యా!

కిష్టయ్య: (పిలుపు పూర్తికాకుండానే అమాంతంగా మధ్యద్వారంలోంచి ప్రవేశించి) అమ్మాయిగారూ...

సరోజ: (మధ్యలో) ఇతన్ని బైటికి పంపించు!

కిష్టయ్య: (చంద్రాన్ని సమీపించి సవినయంగా) అయ్యా! తమరు మర్యాదగా బయటకు వెళ్లిపోతారా? లేకపోతే బయటికి గెంటమని సెలవా? ('ఇప్పటికి వెళ్లిపోవయ్యా, మహానుభావా!' అన్న ధోరణిలో రహస్యంగా సైగ చేస్తాడు.)

చంద్రం: (కోపంతో) సరోజా! ఈ చంద్రంతో పేచీ ఉట్టినే పోయేది కాదు. గుర్తుంచుకో. పశ్చాత్తాప పడవలసిన రోజు వస్తుంది, సరోజా! (చంద్రం చరచరా కుడివైపు వెళ్లిపోతాడు. అతని వెనక కిష్టయ్యకూడా వెళతాడు. సరోజ కోపంతో అటే చూస్తూ ఉంటుంది. ఆ సమయంలో రామ్మూర్తి మధ్యద్వారంలోంచి ఆనందపరవశుడై మాట్లాడుకుంటూ వస్తాడు.)

రామ్మూర్తి: (చేతో నోట్ల కట్టలు పట్టుకొని నోట్లకేసి చూస్తూ) నీలాంటివాడొక్కడు చాలోయ్ చంద్రం. పనికిరాని గాడిదలు పదివేలమంది ఉంటేమాత్రం ఏం లాభం? (తలెత్తి) అరె, లేడే! నేను వచ్చేవరకూ ఉండమన్నాను, గప్‌చిప్‌గా పోయాడే!

సరోజ: ([illegible]) గప్‌చిప్‌గా పోలేదు నాన్నగారూ! నేనే అతన్ని బయటికి గెంటించాను!

రామ్మూర్తి: ( ఒక్కసారిగా ) ఎంతపని చేశావమ్మా! విశ్వేశంలాంటి మనిషి. తవ్వేకొద్దీ బంగారం వచ్చే గనిలాంటివాడు. అతన్ని అవమానించడం అరిష్టం. దూరంచేసుకోవడం దురదృష్టం.

సరోజ: నాన్నగారూ! ఆ చంద్రం పాములాంటి మనిషి. కేవలం ధనమున్నంత మాత్రాన అతన్ని మనం మర్యాద చెయ్యకూడదు. మనిషికి కావలసింది డబ్బొకటే కాదు. బుద్ధి. బుద్ధి ఉన్నవాడే గొప్పవాడు. సద్గుణాలు సన్మార్గానికి దారి తీస్తాయి. దుర్గుణాలు దుర్మార్గానికి దారి తీస్తాయి. అతను దుర్మార్గుడు, దుష్టుడు.

రామ్మూర్తి: ( కోపంతో ) చాలించు నీ వేదాంతం! గుడ్డొచ్చి పిల్లని వెక్కిరించిందిట. నాకే నీతి పాఠాలు చెబుతున్నావు నువ్వు! ( నిందిస్తూ ) మనిషికి కావలసింది డబ్బు కాదూ? బుద్ధా? ఎవడు చెప్పాడు నీకు? డబ్బులేకుండా కేవలం బుద్ధి ఒకటే ఉన్నవాడేం చేస్తున్నాడో ఊళ్లో కి వెళ్లి చూడు.

కిష్టయ్య: ( ఆకస్మికంగా ప్రవేశించి ) బుద్ధి ఒకటే ఉన్నవాడు గడ్డి తింటున్నాడు సార్! వాడికి తిన డానికి తిండి లేదు. కట్టుకోడానికి గుడ్డ లేదు.

రామ్మూర్తి: ( ప్రశంసిస్తూ ) మా మంచి మాట చెప్పావురా కిష్టయ్యా! ( కూతురుకేసి తిరిగి ) చూడమ్మా, వాడికి ఉన్న బుద్ధి నీకు లేదు. ప్రపంచంలో బతకడానికి డబ్బు చాలా అవసరం! డబ్బు లేకుండా ఎవడూ బతకలేడు. దరిద్రం ఉంటే అది మనిషి బుద్ధిని పాడుచేస్తుంది. తెలివితేటల్ని నాశనం చేస్తుంది. ఆత్మవిశ్వాసం లేకుండా చేస్తుంది. దరిద్రుడికి తన చుట్టూ ఉన్నవాళ్లమీద నమ్మకం ఉండదు. తనమీద తనకే నమ్మకం ఉండదు. నగుబట్టే స్వభావం వస్తుంది. తిరుగుబాటు గుణం వస్తుంది. దరిద్రం అనర్థం, అరిష్టం.

సరోజ: ( తీవ్రంగా ) ఇంతకి మీరు చెప్పేదేమిటి నాన్న గారూ?

రామ్మూర్తి: చెప్పడానికేముంది తల్లీ. చంద్రంలాంటి మనిషి మనకు దొరకడు. అతన్ని వదులు కోడం ఉంటే, అంత తెలివైన పని కాదు.

సరోజ ( మాట మధ్యలో కోపంతో కిష్టయ్యకేసి తిరిగి ) కిష్టయ్యా! నువ్వు అవతలికి వెళ్లు! ( కిష్టయ్య బెదురు చూపులు చూస్తూ వెళ్లి పోతాడు. ) నాన్నగారూ! చంద్రం అంటే నాకు కిట్టదు. ఆ సంగతి మీకూ తెలుసు. మీరు నన్నీవిధంగా బాధపెట్టడం మంచిది కాదు. నేను కోరినవాణ్ణి పెళ్లి చేసుకోవడానికి మీరు ఇదివరకే నాకు అనుమతి ఇచ్చారు.

రామ్మూర్తి: అవునమ్మా, ఇచ్చాను. కానీ ఏం లాభం? రాజా చచ్చిపోయాడు. వాడు చావడంతో నేను ఇచ్చిన అనుమతి దానంతట అదే రద్దయి పోయింది. వాడు చావడంవల్ల మనకు ఎన్నో విధాల నష్టం తప్పిపోయింది. వాడు చచ్చి మనల్ని ఉద్ధరించాడు. రాజావాపు మన మంచికే వచ్చింది.

సరోజ: ( మాటమధ్యలో కోపంతో బిగ్గరగా ) నాన్నగారూ!

రామ్మూర్తి: ( రవంత కోపంతో ) ఎందుకంత గావుకేక? నాకేమన్నా చెముడా? ఎందుకు ఆవేశపడతావు? బాగా ఆలోచించుకో. నీకు ఎంత అభిమానం ఉన్నా చచ్చినవాడు బ్రతికి రాడు. నువ్వు నూరేళ్ళ్ల ఎలాగూ పెళ్లి చేసుకోవలసి ఉంది. అలాంటప్పుడు ముక్కూ ముఖం తెలియని పరాయివాణ్ణి చేసుకొనేకంటే చంద్రాన్ని చేసు కోవడం చాలా మంచిది. పెద్దవాణ్ణి కనక, ఇంకా బతికేఉన్నాను కనక, నీ శ్రేయస్సు కోరే వాణ్ణి కనక చెబుతున్నాను. బాగా ఆలోచించుకో. నా మాట విని చంద్రాన్ని పెళ్లి చేసుకో.

సరోజ: నాన్నగారూ! మీరెంత చెప్పినా నేను చంద్రాన్ని పెళ్లి చేసుకోను. చేసుకోలేను. చేసుకోబోను.

రామ్మూర్తి: ( కోపంతో ) కోనూ, లేనూ, బోనూ అంటే అది నీ కర్మ. ఎవరి కర్మానికి ఎవరు కర్తలు! దారినిపోయే ఏ బైరాగినో పెళ్లాడితే ఏం కలిసొస్తుంది? బూడిద! ఒక్కగా నొక్క కూతురువు. నీ నుంచి పెద్దలు నాకు కాకపోతే ఎవరికి? ఇప్పుడు మనం ఎన్ని ఇబ్బందులలో ఉన్నామో, ఎన్ని చిక్కుల్లో ఇరుక్కుపోయి ఉన్నామో నీకు తెలుసా?

> పేదలు మినహా పేదలకోసం బాధపడే వాళ్ళు తక్కువ.
>
> —ఎల్ ఇ లాండన్

సరోజ: ( ఆశ్చర్యంతో ముఖం చిట్లించి ) మనకు ఇబ్బం దులా? చిక్కులా? ఏమిటి నాన్నగారూ మీ రంటున్నది?

రామ్మూర్తి: అవునమ్మా, నీకు తెలియదు. నీకు చెప్ప లేదు. నీకు చెప వలసిన అవసరం రాదనే అనుకున్నాను. కాని చెప్పక తప్పడంలేదు. మన ఇనప్పెట్టె ఖాళీ అయిపోయిందమ్మా! ఎన్నో అప్పులు చేశాను. అప్పులవాళ్లంతా ఉరుగు తున్నారు.

సరోజ: మన డబ్బంతా పోయిందా? అకస్మాత్తుగా అంత డబ్బెలా పోతుంది నాన్నగారూ?

రామ్మూర్తి: పోయిందమ్మా, పోయింది! ఆ పోవడం జూదంలోనో, పేకాటలోనో కాదమ్మా. నీ తండ్రి అలాంటి పాపిష్టి పనులు చెయ్యడు.

సరోజ: ( ఆత్రతతో ) మరెలా పోయింది నాన్నగారూ? త్వరగా చెప్పండి. నా కేదో భయంగా ఉంది.

రామ్మూర్తి: ( పశ్చాత్తాపం పడుతున్నవాడిలా ) తిని, తిన్నగా ఉండలేక బుద్ధి గడ్డి తిని కలప వర్త కంలో కాలుపెట్టానమ్మా. నా అంతట నేను కాలు పెట్టలేదు. ఒకడు పెట్టించాడు. యావత్తూ వేలు పెట్టుబడి పెట్టాను. సగం కలప గోదా వరి వరదకు కొట్టుకుపోతే, సగం కలప దొంగల మూలంగా కొట్టుకుపోయింది. మన ఇల్లు గుల్లయి పోయింది. ఉన్న డబ్బు కాస్తా ఊడిపోయింది. అప్పులు! అప్పులు! చుట్టూ అప్పులు! అప్పుల వాళ్లు వచ్చి మన కుర్చీలు, సోఫాలు వేలం వేస్తారు. అప్పుల బాధ ఎలాంటిదో నాకు మొన్నటివరకూ తెలియదు. ( నిస్పృహతో ) ఆ బాధ పగవాడికి కూడా వద్దురా భగవంతుడా!

సరోజ: నాతో ఎందుకు చెప్పలేదు నాన్నగారూ?

రామ్మూర్తి: చెప్పడానికి నోరు రాలేదమ్మా. ఇప్పుడైనా చెప్పాలనుకోలేదు. అవసరమై అయి చెప్పాను. నిన్నిప్పుడు పరాయివాడికిచ్చి పెళ్లిచెయ్యాలంటే కట్నం కావాలి. వేలకు వేలు కట్నం కావాలి! ఎక్కడినించి తెస్తాను?

సరోజ: నన్నుగురించి బాధపడకండి నాన్నగారూ! నేను పెళ్లి మానేస్తాను. మీకు కట్నం బాధ తప్పుతుంది.

రామ్మూర్తి: వద్దమ్మా! అలా అనకు! నా మాట విని చంద్రాన్ని పెళ్లిచేసుకో! కట్నం ఖర్చు తప్పు తుంది. రాబందులలాంటి అప్పులవాళ్లనించి నన్ను రక్షించినదానవవుతావు.

సరోజ: ( గంభీరంగా ముఖంపెట్టి ) నాన్నగారూ! నాకు చంద్రాన్ని పెళ్లి చేసుకోవడం ఏంత మాత్రం ఇష్టంలేదు. కానీ మన కుటుంబ శ్రేయస్సుకోసం ఒప్పుకుంటున్నాను.

రామ్మూర్తి: ( ఆనందపరవశుడై బిగ్గరగా ) అమ్మా!

సరోజ: ( కంపించే పెదవులతో, అపుకున్న దుఃఖంతో ) నాన్నగారూ!

రామ్మూర్తి: నీ త్యాగం ఆదర్శప్రాయం, అపూర్వం తల్లీ! మన వంశప్రతిష్ఠ నిలబెట్టావమ్మా నువ్వు!

( కిష్టయ్య పెరట్లోంచి ఆకస్మికంగా ప్రవేశిస్తాడు. )

కిష్టయ్య: ( వస్తూనే ) ట్యూటరుగారొచ్చారండీ!

రామ్మూర్తి: ( కోపంతో ) ట్యూటరేమిటిరా నీ తల కాయ?

కిష్టయ్య: మరచిపోయారేమిటి సార్! ట్యూటర్ కావా లని పేపర్లో వేయించారు కదా. పేపర్లో చూసి ట్యూటర్‌గారు దయచేశారు.

రామ్మూర్తి: ఓ! ప్రైవేటు మాస్టరా? సరోజా! ఏం చేద్దామమ్మా?

సరోజ: మనం ప్రకటించిన తరవాత వద్దనడం మంచిది కాదు. లోపలికి రమ్మనండి.

రామ్మూర్తి: ( కిష్టయ్యతో ) వెళ్ళు. లోపలికి రమ్మను. ( కిష్టయ్య నిష్క్రమిస్తాడు. కుడివైపు నుంచి ట్యూటరు వస్తాడు. సన్నగా, పొడ వుగా, తెల్లగా ఉన్నాడు. తెల్లని షర్టుమీద నల్లటి కోటు, అందంగా కత్తిరించిన గడ్డం. పుల్‌పాంట్. చేతిలో పుస్తకం. నిరుత్సాహ మాటంగా మాట్లాడే స్వభావం. వయసు 30 లోపు. )

ట్యూటరు: ( వస్తూనే ) నమస్కారం, రామ్మూర్తి గారూ.

రామ్మూర్తి: ( ఆశ్చర్యంతో ) నా పేరు నీ కెలా తెలుసు?

ట్యూటరు: పేపర్లో చూశానండి. మీ పేరే తలుచు కుంటూ వచ్చాను. ( క్షణం ఆగి ) మీరు రామ్మూర్తిగారు కాదా?

రామ్మూర్తి: ( గంభీరంగా ) నేనే రామ్మూర్తిని. కూర్చో.

ట్యూటరు: ( కూర్చుంటాడు. రామ్మూర్తి పక్కనే కుర్చీలో కూర్చొని ఉన్న సరోజకేసి పరికింపుగా ఒకసారి చూసి తిరిగి రామ్మూర్తితో ) నేనిప్పుడు చదువు చెప్పవలసింది ఎవరికి?

రామ్మూర్తి: అగంతా తరవాత మాట్లాడదాం. ముందు నాకు కొంత సమాచారం కావాలి.

ట్యూటరు: అడగండి. చెబుతాను.

రామ్మూర్తి: నీ దే ఊరు?

ట్యూటరు: చాలా చిక్కు ప్రశ్నే అడిగారు.

రామ్మూర్తి: నీదే ఊరో చెప్పడంలో చిక్కేమిటి?

ట్యూటరు: అసలు ఒక ఊరంటూ ఉంటేకదా చెప్పడానికి? నేను పుట్టింది ఒక ఊళ్ళో. చదువుకున్నది మరొక ఊళ్ళో. ప్రస్తుతం ఉంటున్నది పరాయి రాష్ట్రంలో. ఈ విశాల విశ్వంలో ఏ ఊళ్ళోనూ నాకు ఓటింగు హక్కు లేదు. అలాంటప్పుడు నాది ఏ ఊరని చెప్పమంటారు?

రామ్మూర్తి: ( నిష్కర్షగా ) ఊరూ పేరూ లేనివాళ్ళు మాకు అక్కర్లేదు. నువ్వు వెళ్ళవచ్చు.

ట్యూటరు: ( లేచి నిలబడి విషాదంగా ) నా ఊరూ, నా రాష్ట్రం అనే సంకుచితబుద్ధి లేనివాళ్ళకు ఈ ప్రపంచంలో చోటులేదు. మరేం చేస్తాం? వెళ్ళొస్తాను. సెలవు.

సరోజ: ( వెంటనే ట్యూటరుతో ) మీరు కూర్చోండి మాస్టారూ! ( ట్యూటరు వెంటనే కూర్చుంటాడు. ) నాన్నగారూ! ఆయన ఊరితో మన కేం పని? మనకు కావలసింది చదువు. ఆయన చదువు చెప్పగలరా? లేదా? అన్నది మనం తెలుసుకోవాలి. ( ట్యూటరుకేసి తిరిగి ) మీరేం చదివారు?

ట్యూటరు: నేను బి.ఎ. పాసయ్యానండి.

సరోజ: ఓల్డు రెగ్యులేషన్సా? న్యూ రెగ్యులేషన్సా?

ట్యూటరు: రెండూనూ!

సరోజ: ( ఆశ్చర్యంతో ) రెండు కోర్సులూ చదివారా?

ట్యూటరు: అవునండీ. ఒకదానిలో పరీక్ష పోగా, తిరిగి రెండవ కోర్సులో చదివి పాసయ్యాను. ( పుస్తకంలోంచి రెండు కాగితాలు తీసి, ఒక కాగితం ఆమె చేతికి ఇచ్చి ) ఇదుగో నా డిగ్రీ. చూడండి. ఆ తరవాత ఒక ట్యుటోరియల్ కాలేజీలో రెండేళ్ళు ట్యూటరుగా పనిచేశాను. ( రెండో కాగితం ఇస్తూ ) ఇదుగో వాళ్ళిచ్చిన సర్టిఫికేట్!

సరోజ: ( కాగితాలు తిరిగి ఇచ్చి, తండ్రితో ) నాన్నగారూ, ఈయన సరిగ్గా సరిపోతారు. చదువు, అనుభవం రెండూ ఉన్నాయి. ఇక మీరు ఆలోచించ నక్కర్లేదు.

రామ్మూర్తి: ( కోపంతో ) ఆలోచించ నక్కర్లేదుట. ఇక ఉద్యోగంలో చేరిపోవయ్యా, ట్యూటరూ! ఇంతకూ ఊరు లేకపోతే పోనీ, నీకు పేరైనా ఉందా?

ట్యూటరు: ఒక్క పేరా? మూడు పేర్లున్నాయి!

రామ్మూర్తి: అయితే ఇదేదో అనుమానించవలసిన వ్యవహారమే!

సరోజ: ( వెంటనే ) మీరు ఊరుకోండి నాన్నగారూ! ఈ రోజుల్లో రెండు మూడు పేర్లుండడం ఫాషన్!

రామ్మూర్తి: ( కోపంతో ) ఫాషనట! ఫాషన్! నా శ్రాద్ధం! మా రోజుల్లో నాలుగైదు పేర్లు దొంగలకే ఉండేవి.

సరోజ: ( ఒక్కసారిగా ) అబ్బ! మీకు తెలియదు నాన్నగారూ! ఇక ఆ మాట ఎత్తకండి. ( ట్యూటరుతో సవినయంగా ) మాస్టారూ, మీరేమీ అనుకోకండి. మా నాన్నగారు మాట్లాడే స్వభావమే అంత.

ట్యూటరు: ఐదే రైటు! ఉన్నమాట కుండ బద్దలు కొట్టినట్టు ముఖంమీదే అనెయ్యడం మంచి వాళ్ళ లక్షణం.

రామ్మూర్తి: నీ పేరు ఇప్పుడేమిటి?

ట్యూటరు: చక్రవర్తి.

రామ్మూర్తి: కొంపదీసి నువ్వు బెంగాలీవాడివేమిటి?

ట్యూటరు: కాదండి. నూటికి ఇరవై అయిదు పాళ్ళు తెలుగువాణ్ణి. ఇరవై పాళ్ళు అరవవాణ్ణి. ఐదు పాళ్ళు బెంగాలీని.

సరోజ: ( చిరునవ్వుతో ) మీరు లెక్కలు వేస్తారా? మీ రిప్పుడు చెప్పిన నిష్పత్తి ఏమిటి?

ట్యూటరు: అది తెలుగు సినిమా నిష్పత్తి. నేను మాథమాటిక్సులో రిసెర్చిచేసి కొత్త పోకడలు కొన్ని కనిపెట్టాను. అవన్నీ రేపటినుంచి మీకు చెప్పగలను.

రామ్మూర్తి: ( సందేహంతో ) సినిమాకూ లెక్కలకూ సంబంధం ఏమిటి మేస్టారూ?

ట్యూటరు: ( తేలిగ్గా ) అబ్బే, మామూలు సంబంధమే. ఇంతవరకూ నిష్పత్తి లెక్కలు పంట పాలాటకు, మ్యాళ్ళకూ సంబంధించి ఉంటున్నాయి. అలా ఉంటే ఈకాలపు పిల్లల బుర్ర కెక్కవు. కాలంతోపాటు మనం — మనతోపాటు మన లెక్కలూ మారాలి.

రామ్మూర్తి: అందుకని సినిమా పాటల లాగ ప్రత్యేకించి సినిమా లెక్కలు సృష్టించావేమిటి?

సరోజ: మిగిలిన సంగతులు మాట్లాడండి నాన్నగారూ!

రామ్మూర్తి: ( ట్యూటరుతో ) అబ్బాయ్, చక్రావధానులూ, నువ్వు...

ట్యూటరు: ( మధ్యలో ) నా పేరు చక్రావధానులు కాదండీ! చక్రవర్తి!

రామ్మూర్తి: ఏదో ఒకటి! నా తలకాయ! మా అమ్మాయికి నువ్వు రెండు పూటలూ చదువు చెప్పడానికి నెలకు ఎంతిమ్మంటావ్?

ట్యూటరు: ( సవినయంగా ) మీ దయ. ఎంతిచ్చినా సరే!

రామ్మూర్తి: ( సంతోషంతో వెంటనే ) అమ్మాయీ! ఈసారి నాకీ మాస్టారు పూర్తిగా నచ్చాడు. నీ ఇష్టం. నీకుకూడా నచ్చితే ఇప్పుడే కుదిర్చేస్తాను.

సరోజ: అలాగే నాన్నగారూ!

రామ్మూర్తి: ( ట్యూటరుతో ) అబ్బాయ్, ఇప్పటి క్షణం నుంచి చదువు ప్రారంభించవచ్చు.

ట్యూటరు: ( లేచి ) చాలా సంతోషం సార్. వెళ్ళి వస్తాను.

రామ్మూర్తి: ( ఒక్కసారిగా తెల్లబోయి ) అదేమిటి? వెళ్ళిపోతానంటున్నావు!

( సరోజ కూడా ఆశ్చర్యంతో ట్యూటరుకేసి చూస్తుంది. )

ట్యూటరు: ఏకంగా వెళ్ళిపోవడం లేదండీ! అవతల



పోరాటం

కత్తిరింపుచిత్రం—కె. శారద రెడ్డి (కాకినాడ.1)

అటోరిక్షాలో నా సామాన్లు ఉన్నాయి. ఎక్కడైనా ఇల్లొకటి అద్దెకు పుచ్చుకుని సామాన్లు దించి రెండు గంటల్లో తిరిగి వస్తాను.

రామ్మూర్తి: వద్దు! వద్దు! అలాంటి పని చెయ్యకు. మాకు ఇంతంత కొంప ఉంటే నువ్వు అక్కడా అక్కడా ఉండడం ఎందుకు? (ఎడమవైపు చూపిస్తూ) అదుగో! ఆ గది నీకు ప్రత్యేకించి ఇస్తున్నాను. నువ్వందులో ఉండవచ్చు.

ట్యూటరు: (తడబాటుతో) చాలా సంతోషం రామ్మూర్తిగారూ! మీ కెలా కృతజ్ఞత చెప్పాలో నాకు తెలియడం లేదు. నిలుచోడానికి నీడలేని సమయంలో ఆపదలో కాపాడారు నన్ను!

రామ్మూర్తి: ఫరవాలేదు నాయనా, సామాన్లు తెచ్చుకో.

సరోజ: (బిగ్గరగా) కిష్టయ్యా!

కిష్టయ్య: (ప్రవేశించి) అమ్మాయిగారూ!

సరోజ: వీరి సామాన్లు తీసుకువచ్చి ఆ గదిలో పెట్టు.

కిష్టయ్య: (ట్యూటరుతో) రండి సార్. రండి సార్.

(ట్యూటరు, కిష్టయ్య కలిసి కుడివైపు వెళతారు.)

రామ్మూర్తి: (సరోజతో నెమ్మదిగా) కుర్రాడు బుద్ధిమంతుడులాగే కనిపిస్తున్నాడు. మన దేశవాళీ మాస్టర్లలాగ డబ్బుమీద దురాశ ఉన్నట్టు కనిపించదు.

సరోజ: అలా అని జీతం ఇవ్వడం మానేశారు కనక నాన్నగారూ!

రామ్మూర్తి: నీ కెందుకమ్మా! ఆ లావాదేవీలన్నీ నాకు వదిలిపెట్టు.

(రెండు సూట్‌కేసులూ రెండు చేతులతోనూ పట్టుకొని కిష్టయ్య, అతని వెనక ఫిడేలు పెట్టె పట్టుకొని ట్యూటరూ వస్తారు. ఇద్దరూ కలిసి గదిలోకి వెళ్ళిపోతూ ఉండగా రామ్మూర్తి ఆశ్చర్యంతో అటే చూస్తాడు.)

రామ్మూర్తి: (ఒక్కసారిగా) అబ్బాయ్! కొంపదీసి నువ్వు సంగీతం మేస్టారువు కావు కదా?

(ట్యూటరు ఆగుతాడు. కిష్టయ్య పక్క గదిలోకి వెళ్ళిపోతాడు.

ట్యూటరు: నేను సంగీతంకూడా చెప్పగలను.

రామ్మూర్తి: వద్దు. వద్దు. సంగీతం చెప్పడానికి ఒప్పుకోను నేను. మా సరోజకు పి.యు.సి. పరీక్ష పోయింది. నువ్వా చదువు కాస్త చెప్పి ఆ పరీక్ష పాస్ చేయిస్తే చాలు.

ట్యూటరు: సంగీతం ఎంత గొప్ప విద్య అయినా రాణించడం లేదు. మీలాంటివారు చిన్న చూపు చూడడమే అందుకు కారణం.

రామ్మూర్తి: అయితే ఏమంటావ్? నేను వద్దన్నా సంగీతం చెప్పేస్తా వేమిటి?

ట్యూటరు: ఎంత మాట! వదువాక్కుటే చెబుతాను.

(గదిలోకి వెళ్ళిపోతాడు.)

రామ్మూర్తి: (అటే చూస్తూ) ఈ మేస్టారు సంగతి అంతుపట్టకుండా ఉంది. నాలుగు రోజులు పోతేగాని మంచి చెడ్డలు తెలియవు. అందాకా కాస్త ఓపిక పట్టి (శ్రద్ధగా మసులుకో. చనువుగా ఉండకు. చదువును గురించి తప్ప ఇంకో మాట మాట్లాడకు. సినిమా సంగతి అసలు మన కొంపలో ఎత్తకూడదని చెప్పు. నేను వెళ్ళి చంద్రాన్ని ఊరడించి వస్తాను.

సరోజ: (కోపంతో) నాన్నగారూ! మీరు చంద్రం దగ్గిరికి వెళ్ళద్దు.

రామ్మూర్తి: (నిష్ఠూరంతో) మళ్ళీ ఏం వచ్చిపడింది? ఇప్పుడే కదా నువ్వు చంద్రాన్ని పెళ్ళి చేసుకోడానికి ఒప్పుకున్నావు!

సరోజ: అవును, నాన్నగారూ. ఒప్పుకున్నాను. ఇష్టం ఉండి ఒప్పుకోలేదు. మన కుటుంబ శ్రేయస్సు కోసం ఒప్పుకున్నాను. అంతమాత్రాన మీరు ఇప్పుడే వెళ్ళి అతనిని బతిమాలడం మంచిది కాదు. మీరు అలా చేస్తే అతను మనల్ని లోకువ కడతాడు. నన్ను నీడలా వెంటాడతాడు. ఇప్పుడే వచ్చి ఇక్కడ కూర్చుంటాడు. నా చదువు సాగదు. నాకు ఆనందం ఉండదు. (ఉద్రేకంతో మాట పూర్తిచేస్తుంది.)

రామ్మూర్తి: మరేం భయం లేదమ్మా! ఇక్కడికి వచ్చినా అన్నీ కాచుకునే పూచీ నాది. నువ్వు నిశ్చింతగా చదువుకోవచ్చు. అతనితో నే నిప్పుడు అత్యవసరంగా డబ్బుకు సంబంధించిన లావాదేవీలు మాట్లాడాలి. నువ్వు హాయిగా కులాసాగా చదువుకో. వస్తాను.

> ఆదాయాన్ని మించిన ఖర్చు ఉన్నవాడు పేద.
>
> —బ్రూయర్

(రామ్మూర్తి కుడివైపు వెళ్ళిపోతాడు. సరోజ కుర్చీలో కూర్చుని విచారంతో తండ్రి వెళ్ళిన వైపు చూస్తూ ఉంటుంది. లోపలినుంచి ట్యూటర్ వస్తాడు. ఆమె చూడదు.)

ట్యూటరు: (ఆమె వెనక నిలబడి పరిశీలనగా చూస్తూ) అమ్మాయీ! (ఆమె ఉలికిపడి లేచి నిలబడుతుంది.) విచారంగా ఉన్నావెందుకు?

సరోజ: (తడబాటుతో) అహా, ఏం లేదండి.

ట్యూటరు: (పట్టి పట్టి మాట్లాడుతూ) ఎందుకమ్మాయీ నా దగ్గర దాస్తావు? నువ్వు చాలా విచారంగా ఉన్నావు. నల్లటి చీర కట్టావు. నల్లటి గాజులు వేసుకున్నావు. నిస్సందేహంగా నువ్వు నల్లటి విచార సముద్రంలో మునిగి ఉన్నావు.

సరోజ: మాస్టారూ, దయచేసి మీరు నా స్వవిషయంలో కలగచేసుకోవద్దు.

ట్యూటరు: నువ్వు చెప్పింది నిజమే. ఒకరి విషయంలో మరొకరు తల దూర్చకూడదు. అది లోకనీతి. ఆ నీతి చదువుచెప్పేవాడికి వర్తించదు. బడిపంతులు విద్యార్థి మానసిక స్థితి తెలుసుకోవాలి. సైకాలజీ తెలిసినవాడే చక్కగా చదువు చెప్పగలడు. కనక సంశయం విడిచిపెట్టు. నీ విచారానికి హేతువు చెప్పు. హేతువాదంతో పరిశీలిద్దాం. మన దేశాన్ని పీల్చి పిప్పిచేసే సెంటిమెంటును



ఒక మూలకు నెట్టేయ్. అసలు విషయం చెప్పు. ఆత్మీయులెవరైనా గతించారా?

సరోజ: (విచారభావంతో) అవునండి!

ట్యూటరు: అందుకేనా నువ్వు నల్లచీర కట్టుకున్నావు?

సరోజ: (అవునన్నట్టు తల ఊపుతుంది.)

ట్యూటరు: (సూటిగా) నువ్వుచేస్తున్నది పొరబాటు!

సరోజ: (ఒక్కసారిగా) ఏమిటి మీ రంటున్నది?

ట్యూటరు: విచారానికి చిహ్నం నలుపు కాదు. అది ఇంగ్లీషు సంప్రదాయం. నువ్వేదో తెలుగు సినిమా చూసి ఉంటావు.

సరోజ: మరి. . . మన సంప్రదాయం ఏమిటి?

ట్యూటరు: విచారానికి ప్రశాంతమైన చిహ్నం తెలుపు. అది మన పూర్వులు నిర్ణయించినది. యుగయుగాల వెనకనుంచీ వస్తున్న ఆచారం అది. ఇక ఆ ప్రసక్తి విడిచిపెట్టు. ఇంతకూ ఆ గతించిన అదృష్టవంతు డెవరు?

సరోజ: (కోపంతో) గతించడం అదృష్టమా?

ట్యూటరు: అవును. మన శాస్త్రరీత్యా ఎంత త్వరగా చచ్చిపోతే అంత అదృష్టవంతుడు. చిరకాలం బతికినవాడు పాపి.

సరోజ: మీ మాటల ధోరణి వింతగా ఉంది. మీరు నవనాగరికులో, పురాతనులో తెలియకుండా ఉంది.

ట్యూటరు: నేనా? రెండింటి మిశ్రమం నేను. పాత కొత్తల మేలు కలయిక. పాతలో ఉన్న మంచిని, కొత్తలో ఉన్న మంచిని ఏర్చి కూర్చి ఒక మిశ్రమ సిద్ధాంతం కని పెట్టాను. అది సనాతనులకు, అధునాతనులకు ఆమోదయోగ్యమైనది. సర్వజన రంజకం! (వెనక్కి తిరిగి ఎడమవైపు గదికేసి చూస్తూ) ఎందుకబ్బాయీ? అక్కడే ఆగిపోయావెందుకు?

కిష్టయ్య: (ఎడమవైపు గదిలోనుంచి అడుగు ముందుకు వేసి) అబ్బెబ్బే, ఏం లేదండి!

ట్యూటరు: నీకు పాఠం వినాలని ఉంటే ముందుకు వచ్చి నిలబడి విను. బాగా బుర్రకు పడుతుంది.

సరోజ: (కోపంతో) కిష్టయ్యా! నువ్వు లోపలికి పోయి పని చూసుకో! (కిష్టయ్య మధ్య ద్వారంలోంచి లోపలికి వెళ్ళిపోతాడు.) ఏమీ అనుకోకండి మాస్టారూ! అతనికి మర్యాదలు తెలియవు.

ట్యూటరు: నేను నేర్పుతాను. ఫరవాలేదు.

సరోజ: నేను కొంతవరకూ నేర్పాను. కాని నా రాజా పోయిన దగ్గిరనుంచీ విరక్తి కలిగింది. ఇంటి సంగతులు పట్టించుకోవడం మానేశాను.

ట్యూటరు: అయితే మీ రాజా యువకుడే అయి ఉండాలి. పెళ్ళి అయిన ఎంతకాలానికి అతను మరణించాడు?

సరోజ: (బాధగా) పెళ్ళి కాలేదండి!

ట్యూటరు: (ఒక్కసారిగా) ఓ మై గాడ్! పెళ్ళికాక ముందే ఇంత ప్రేమ చూపించావు కదా? పెళ్ళి అయిన తరవాత చచ్చిపోయి ఉంటే,

ఇంకా ఎంత అనురాగం చూపించి ఉండే దానవో కదా! నీలాంటి జాలి మనసును కొల్లగొట్టుకుపోయిన రాజా అదృష్ట వంతుడు. కంకాలం బతికి చచ్చేకంటే — అలాంటి అందమైన బతుకు అయిదు రోజులు చాలు. జన్మ ధన్యమై నట్టే కదా!

సరోజ: ( జాలిగా ) మాష్టారూ! ఇంతకాలానికి నా బాధ అర్థం చేసుకున్నవాళ్లు మీ రొక్కరు కనిపించారు!

ట్యూటరు: బాధను అర్థం చేసుకోవడమే కాదు. బాధా నివారణకు చేయగాల ప్రయత్నం.

సరోజ: మీ అభిమానానికి కృతజ్ఞురాలిని.

ట్యూటరు: ( ఆలోచిస్తున్నవాడిలా ) మంచిది! మీ రాజా ఎప్పుడు చచ్చిపోయాడు? ఎందుకు చచ్చిపోయాడు? ఎక్కడ చచ్చిపోయాడు? ఎలాగ చచ్చిపోయాడు? హత్యా? ఆత్మ హత్యా?

సరోజ: ( బాధగా ) ఎవరికీ చెప్పకుండా వెళ్ళిపోయాడు. ఎక్కడికి వెళ్ళాడో తెలియదు. ఎందుకు వెళ్ళాడో తెలియదు. కొన్నాళ్ళకు పట్నంలో ఉన్నట్టు తెలిసింది. తరవాత అక్కడే . . ( గద్గద కంఠంతో చెప్పలేకపోతుంది.)

ట్యూటరు: అక్కడే చచ్చిపోయాడంటావు?

సరోజ: ( అవునన్నట్టు తల ఊపుతుంది. )

ట్యూటరు: రాజా చచ్చిపోతూ ఉండగా ఎవరైనా చూశారా?

సరోజ: తెలియదు.

ట్యూటరు: పోనీ అతను చచ్చిపోయిన తరవాత అతని శవాన్ని నువ్వు చూశావా?

సరోజ: ( తీవ్రంగా ) మాస్టారూ!

ట్యూటరు: కోప్పడకు. నిన్ను బాధపెట్టడంకోసం అడ గడం లేదు. నీకు మేలు చేద్దామనే అడుగు తున్నాను. అపరాధపరిశోధనలో స్కాట్లండ్ యార్డ్ పోలీసుల దగ్గర మనం ఎన్నో సంగ తులు నేర్చుకోవలసి ఉంది. నేను కొంచెమే నేర్చుకున్నాను. నువ్వేమీ అనుకోకుండా నా ప్రశ్నలకు జవాబు చెప్పు. అతను చచ్చిపోయిన తరవాత నువ్వు చూశావా?

సరోజ: లేదు.

ట్యూటరు: పోనీ. ఎవరైనా స్వయంగా చూసినవాళ్ళు వచ్చి చెప్పారా?

సరోజ: లేదు.

ట్యూటర్: డాక్టర్లుకాని, పోలీసులుకాని చచ్చిపోయి నట్టు సర్టిఫికెటు ఇచ్చేరా?

సరోజ: లేదు.

ట్యూటరు: అయితే ఇది హత్య కాదు. ( క్షణం ఆగి ) పోనీ, అతను చచ్చిపోయే ముందు చచ్చిపో తున్నా నంటూ స్వహస్తాలతో ఎవరికైనా ఉత్తరం రాశాడా?

సరోజ: లేదు.

ట్యూటరు: కనక ఇది ఆత్మహత్యకూడా కాదు.

కిష్టయ్య: ( ఆగలేక మధ్యద్వారంలోంచి తల ఇవతలకు పెట్టి ) అద్భుతం. కథ మలుపు తిరిగింది.

( ట్యూటర్, సరోజ అదిరిపడి వెనక్కి తిరిగి చూస్తారు. ) సస్పెన్సులో పడిపోయింది.

సరోజ: ( కోపంతో ) నువ్వు లోపలికి పోతావా? లేక పోతే స్టైకి పంపించమంటావా?

( కిష్టయ్య లోపలికి వెళ్లిపోతాడు. )

ట్యూటరు: పాపం. కుర్రాడు. సస్పెన్సు భరించలేక పోయాడు. మన కథలోకి వద్దాం. తరచి చూసే కొద్దీ చిత్రంగా కనిపిస్తోంది. అతను చచ్చిపోయినట్టు ఇంతవరకూ ఒక సాక్ష్యం కూడా దొరకలేదు. మరి అతను చచ్చిపోయి నట్టు ఒక నిర్ధారణకు నువ్వు ఎలా రాగలిగావు?

సరోజ: ఒక రోజున అకస్మికంగా టెలిగ్రాం వచ్చింది. అదిరే గుండెలతో అందుకున్నాను. కవరు చింపి చూశాను. ఇక నాకు ప్రపంచం కనిపించ లేదు!

ట్యూటరు: ఇక...ఆ ఉత్తరక్షణంలోనే ఆ టెలిగ్రాం కూడా మాయమై ఉంటుంది.

సరోజ: ( ఆశ్చర్యంతో ) బాగా పోల్చుకున్నారే! నిజంగా అలాగే జరిగింది. ఆ రాత్రి నాకు తిరిగి స్పృహ వచ్చేసరికి టెలిగ్రాం లేదు. ఏమయిందని అడిగితే ఎవరూ చెప్పలేదు. నౌకరును నిలదీసి అడిగితే అతను నిజం చెప్పాడు. ఆ టెలిగ్రాం చూస్తున్న కొద్దీ నాకు బాధ ఎక్కువవుతుం దని దాన్ని అగ్గిపుల్లతో వెలిగించేశానని చెప్పాడు.

ట్యూటరు: ( ఒక్కసారిగా ) ఇప్పుడున్న నౌకరేనా?

సరోజ: కాదు. అతన్ని మానిపించేశాం.

ట్యూటరు: ఓహో, అలాగా. ఈ కేసు తరచిచూసే కొద్దీ అనుమానం పెరిగిపోతూంది. అంతు దొరకడం లేదు.

సరోజ: ( అతని ముఖంలోకి తొలిసారిగా చూస్తూ మీ గొంతుకు ఎక్కడో విన్నట్టు ఉంది!

ట్యూటరు: ( సంతోషంతో ) నిజం. నూటికి నూరు పాళ్లు నిజం. ఈ ప్రశ్న మొదటే వేసి ఉండ వలసింది.

సరోజ: ఎక్కడ విన్నానో గుర్తు రావడం లేదు. మీరు చెప్పగలరా?

ట్యూటరు: ఓ. ఎందుకు చెప్పలేను? నీకు డబ్బింగు సినిమాలు చూసే అలవాటు ఉందా?

సరోజ: ఉంది.

ట్యూటరు: నేను చాలా డబ్బింగు చిత్రాలలో హీరోకు నా గొంతు ఎరువిచ్చాను!

సరోజ: ( సంతోషంతో ) ఓ అలాగా! అయితే మాస్టారూ, అరవభాషలో మాటకు తెలు గులో అదే అర్థం వచ్చే మాట ఎలా అతుకు తుంది?

ట్యూటరు: మంచి ప్రశ్న వేశావు. డబ్బింగు చిత్రాలలో రచయితదే ఎక్కువ కష్టం అని చాలా మంది అనుకుంటారు. అది తప్పు. తర్జుమా చిత్రాలకు రచయిత లేకపోయినా నష్టం లేదు. చౌకబారు మాటలు రాయడానికి పెద్ద కొమ్ములు తిరిగిన రచయిత అక్కర్లేదు. మరి కష్టం ఎవరి దంటావా? గొంతు ఎరువిచ్చినవాడిది. ఉదాహరణకు, 'అవును' అన్నమాట ఉందనుకో. దాన్ని అయిదు వందల రకాలుగా చెప్పవచ్చు. కోపంతో అన్నప్పుడు బిగ్గరగా 'హవును' అని హూంకరించాలి. నీరసంగా అన్నప్పుడు 'ఆవును' అనవచ్చు. లేదా 'అవ్ను' అనవచ్చు. ఆశ్చర్యంగా అన్నప్పుడు 'అ' మీద నొక్కి 'అ...వ్వునా' అనాలి. నిర్లక్ష్యంగా అన్నప్పుడు 'ఔను' అనాలి. "అయితే అవుతుంది. నువ్వేం చేస్తావోయ్, తుంటాయ్?" అన్న అర్థంలో వాడినప్పుడు 'అనేను' అనవచ్చు! ఇంతకూ చిత్రంలో నటుడు ఏ ధోరణిలో ఆ మాట అన్నాడో తెలుసుకోవాలి.

కిష్టయ్య: ( మధ్యద్వారం దగ్గర కనిపించి బిగ్గరగా ) సార్, మీరు సినిమాలను గురించి చదువు చెప్పకూడదు. అది రామ్మూర్తిగారి ఆర్డర్.

ట్యూటరు: ( నిరుత్సాహంతో ) మైగాడ్! వీ డెక్కడ దొరికాడు నక్షత్రకుడిలాగ!

సరోజ: ( కోపంతో ) కిష్టయ్యా!

( కిష్టయ్య లోపలికి వెళ్ళిపోతాడు. )

ట్యూటరు: ( కిష్టయ్య నిష్క్రమించేవరకూ ఆగి సరోజతో ) వీడు నౌకరా? లేకపోతే మనకి కాపలాదారా?

సరోజ: ఈసారి అలా జరక్కుండా నేను చూస్తాను లెండి.

( తరువాయి 28 వ పేజీలో )

## ఎలా చెప్పడం?

### జి. వి. సోమేశ్వరరావు

ప్రేమించానంటే పేలాపన అంటావు,
వలచానంటే వెర్రివాడి నంటావు,
సత్యమిదంటే పిచ్చివాడి నంటావు,
కాని, ఎలా చెప్పకుండా ఉండడం?

కామం కాదంటే కానీలే అంటావు,
మోహం లేదంటే పోనీలే అంటావు,
నిర్మలం అంటే పక్కున నవ్వావు,
కాని, ఎలా చెప్పకుండా ఉండడం?

నీ కనులలో నీలాలు
నీ హాసంలో రోజాలు
సావాసంలో సరసాలు
నాకే కావాలి, కాని, ఎలా చెప్పడం?

నీ వినీల వేణీభరము
అచుంబితాధరాలు
అరుణారుణ కపోలాలు
నాకే కావాలి, కాని, ఎలా చెప్పడం? ★

ట్యూటరు: ( సరోజను పరిశీలించి ) నిన్ను చూస్తూ ఉంటే ముద్దుగా ఉంది. చక్కని ఫేసన్స్. చక్కని లెలిని. చూసేకొద్దీ చూడాలనే రూపం. ( పరవశ్యంతో ) అమ్మాయీ! నిన్ను చూస్తూ ఉంటే ఎంతటివాడికైనా మనసు అదోలా అయిపోతుంది.

సరోజ: ( కోపంతో ) మాస్టారూ, మీరు హద్దుమీరి మాట్లాడుతున్నారు!

ట్యూటరు: హద్దుమీరడానికి అనుమతి ఇవ్వండని ప్రార్థన! ( ఆమె చేతివేళ్ళు పట్టుకుంటాడు. )

సరోజ: ( కోపంతో చెయ్యిలాగి అతని చెంపమీద ఒక్కటి వేసి ) ఏం? ఎలా ఉంది?

ట్యూటరు: ( పరవశుడై ) ఏ! ఎంత హాయి! ఎంత సొగసు! అదే చేయి! అదే హాయి! హా సరోజా! ఎంత కాలానికి!

సరోజ: ( ఆశ్చర్యంతో ఒక్కసారిగా ) రాజా!

రాజా: సరోజా

సరోజ: ఏమిటీ వేషం?! ( గడ్డం పట్టుకొని లాగివెయ్యబోతుంది. )

రాజా: ( తప్పించుకుంటూ ) అఁ! అఁ! కొంప ముంచేస్తావు! ( ఆమె ఆనంద పారవశ్యంతో మీదిమీదికి వస్తూ ఉంటే అతను హాలంతా తిరుగుతూ తప్పించుకుంటూ ) అవతల కాపలాదారుడు ఉన్నాడు. ఆగు. నా మాట విను. రెండు నిముషాలు ఆగు. ఆ తరవాత నీ ఇష్టం.

సరోజ: ( దూరంగా ఆగి ) ఇదెంత మంచి రోజు! నువ్వు వచ్చిపోలేదా రాజా?

రాజా: ( నారిస్తూ ) ష్! అదంతా తరవాత. ( వెనక్కి తిరిగి ) అబ్బా...గ్!

కిష్టయ్య: ( వెం ... ...ంచి—కోపంతో ) ఏం? ఎందుకు?

రాజా: కొంపడకోల ... ! ( జేబులోంచి పర్సు తీసి, అయిదు ... నోటు తీసి ) ఇదుగో! ఈ నో ... వెళ్ళి ఒక సిగరెట్లు పెట్టె తెచ్చి ...

కిష్టయ్య: ( తి ... ) నేను తేను!

సరోజ: ( కోపంతో ) ఏం కిష్టయ్యా, పొగరుగా ఉందా?

కిష్టయ్య: నేను మీకు నౌకర్నిగాని ఆయనకు నౌకర్ని కాదండి.

సరోజ: వెళ్ళు! మాట్లాడకుండా వెళ్ళి ఆయన చెప్పిన పని చేసుకురా.

కిష్టయ్య: మీరు చెబితే ఎందుకు చెయ్యను? అలాగే చేస్తాను. ( ట్యూటరు కేసి తిరిగి నోటు తీసుకొని రుసరుస లాడుతూ ) ఏం సిగరెట్లు కావాలి?

రాజా: కింగ్ సైజ్ సిగరెట్లు పెట్టె కావాలి.

కిష్టయ్య: ఈ పేరెక్కడా వినలేదే!

రాజా: అది స్పెషల్ క్వాలిటీ. అమెరికాలో తయారైన సిగరెట్లు. చిన్న షాపుల్లో దొరకవు. పెద్దపెద్ద షాపుల్లో ప్రయత్నించు. ( కిష్టయ్య ముఖం చిట్లించుకొని వెళ్ళిపోతాడు. అతను వెళ్ళే వరకూ రాజా అటే చూసి ) వీణ్ణి చూసేకొద్దీ

## విచిత్రపథ

(15 వ పేజీ తరువాయి)

ముచ్చటేస్తూంది. మీ ఇంటి పరిస్థితి చాలా అనందంగా ఉంది. ఇక్కడ పోషణం ఉంది. మీ ఇంట్లో సొకరే యజమాని. నాకు నచ్చింది.

సరోజ: ( అతని చెయ్యి పట్టుకొని ) కాలం వృథా చెయ్యకు రాజా! ఇంతకాలం ఎక్కడికి వెళ్ళావు? ఏం చేశావు? ఇంకా ఈ పాడు వేషం ఎందుకు? ( అతని గడ్డం పట్టుకు లాగేస్తుంది. )

రాజా: కొంప ముంచావు! ఇప్పుడు మీ నాన్న వస్తే ట్యూటరుకు బదులు 'రాజా' కనిపిస్తాడు. దాంతో మీ నాన్న రుద్రుడైపోతాడు. ( చుట్టూ చూస్తూ ) ఇప్పుడేం దారి? గడ్డం అంటించుకుందామంటే స్పిరిట్‌గమ్ లేదు.

సరోజ: ( కోపంతో ) రాజా, ఇక చాలించు నీ నటన! నువ్వు నన్ను మోసం చెయ్యడానికి కారణం ఏమిటి?

రాజా: ( ఆశ్చర్యంతో ) ఇదేం మాట? నేను నిన్ను మోసం చెయ్యడం ఏమిటి?

సరోజ: మరేమిటిదంతా? నిన్ను తప్ప మరెవర్నీ పెళ్ళాడనని మాట ఇచ్చావు. తీరా ఆ సమయం వచ్చేసరికి పరారీ అయిపోయావు!

> నవలలు పాఠకులను నిర్బంధించి పాపాలు చేయించవు; పాపాలు చేయడం ఎలాగో బోధిస్తాయి.
>
> —జిమ్మరోమన్

రాజా: ( మధ్యలో ) లేదు సరోజా! నేను పారిపోలేదు.

సరోజ: ( నిలదీసి ) నువ్వు వెళ్ళేటప్పుడు నాతో చెప్పి వెళ్ళావా?

రాజా: లేదు.

సరోజ: మరి దాని అర్థం ఏమిటి? చెప్పకుండా వెళితే పారిపోవడం కాదా?

రాజా: ( కోపంతో ) ఎవరి సొమ్మయినా ఎత్తుకుపోతే పారిపోవడం అవుతుంది. ఎవర్నయినా వంచించి ఊరు వదిలిపెట్టిపోతే పరారీ అవుతుంది. నే నలాంటి పనులేమీ చెయ్యలేదు.

సరోజ: ఎందుకు చెయ్యలేదు? డబ్బుకంటే విలువైన నా హృదయాన్నే ఎత్తుకుపోయావు!

రాజా: ( మధ్యలో ) తప్పు! తప్పు! హృదయం అనడం ఫాషన్ కాదు. 'మనసు' 'మనసు' అనాలి.

సరోజ: ( కోపంతో ) నన్ను మభ్యపెట్టడానికి ప్రయత్నించకు, నిజం చెప్పు. నన్నెందుకు మోసం చేశావు? ఎందుకు వెళ్ళిపోయావు? నన్ను దారుణంగా హింసించడానికి కారణం ఏమిటి?

రాజా: ( దృఢస్వరంతో ) నేను నిన్ను హింసించలేదు. మోసం చెయ్యలేదు. మభ్యపెట్టలేదు.

సరోజ: నువ్వు వెళ్ళిన తరవాత ప్రేమతో ఒక ఉత్తరమైనా రాశావా?

రాజా: ( నూటిగా ) నీకు ప్రేమలేఖ రాసి మీ నాన్నతో తగాదా తెచ్చుకోమంటావా?

సరోజ: ( చురచురా చూస్తూ ) మా నాన్నకు జడిసి నువ్వు మానేశావా?

రాజా: అంతేకాదు. దానికి చాలా కారణాలు ఉన్నాయి. చెబుతాను. విను. నేను పట్నం పోవడానికి కారణం సినిమారంగం. కళాసేవ.

సరోజ: నాకంటే నిన్ను సినిమా రంగం ఎక్కువ ఆకర్షించిందా?

రాజా: అదంతా తరవాత, ముందు నా మాట విను. అందరిచుట్టూ తిరిగి ఒక స్టాండెంటు వేషం సంపాదించాను.

సరోజ: ( ఆశ్చర్యంతో ) ఏమిటి? నువ్వు సినిమాలో వేషంకూడా వేశావా?

రాజా: ( నిర్లక్ష్యంగా ) ఔను.

సరోజ: ఎందులో?

రాజా: పెద్ద పెద్దవాళ్ళంతా చిన్న చిన్న కాలేజీ స్టూడెంట్లుగా నటించిన చిత్రంలో నేనుకూడా ఒక స్టూడెంటును! అలాంటివే రెండు మూడు అల్లరి చిల్లర వేషాలు దొరికాయి. దానితో కళాపోషణ మార్గాలు తప్పిపోయాయి. ఉదరపోషణ సమస్య ఎదురు వచ్చింది. వెంటనే డబ్బింగు చిత్రాలు సాక్షాత్కరించాయి. ఆ రోజుల్లో మన విలన్ పట్నం వచ్చి నన్ను కలుసుకున్నాడు.

సరోజ: ( ఆశ్చర్యంతో ) ఎవరూ? చంద్రం వచ్చాడా?

రాజా: ( కోపంతో ) అవును. వాడే వచ్చాడు. నువ్వెవరినో ప్రేమించి పెళ్ళి చేసుకున్నావని వాడే చెప్పాడు.

సరోజ: ( కోపంతో ) ఓ అలాగా? ఈసారి రానివ్వు! చెబుతాను!

రాజా: దానితో పరాధీనవైన నిన్ను మరిచిపోవడం శ్రేయస్కరమని భావించాను. 'నువ్వే నా సుఖపడు ప్రియుతమా!' అనుకొని నా దోరణిలో నేను పడ్డాను. నెల రోజుల క్రితం మళ్ళా వచ్చాడు చంద్రం. వాడు మాట్లాడే ధోరణిని బట్టి నాకు అనుమానం వచ్చింది. ( ఆకస్మికంగా ఏదో స్ఫురణకు వచ్చినవాడిలా ) నేను చచ్చిపోయినట్టు టెలిగ్రాం ఎప్పుడు వచ్చింది?

సరోజ: నెల రోజులయింది.

రాజా: ఇది పూర్తిగా చంద్రం ఆడిన నాటకం. వాడు పట్నం వచ్చి నా గదిలోనే మకాం పెట్టి, నా కారేజీలో భోజనం చేసి, నా బెడ్డింగుమీదే పడుకుని, చివరికి నేను చచ్చిపోయినట్టు టెలిగ్రాం కొట్టాడు. ద్రోహం! ద్రోహం! వాణ్ణి చీల్చినా పాపం లేదు! ( బిగ్గరగా ) ఎక్కడా? వాడెక్కడా?

సరోజ: ( కోపంతో ) రాజా! ఎందుకా గావుకేకలు?

రాజా: ( కోపంతో ) ఏమిటీ? నావి గావుకేకలా? ఇంకా నయం. చావుకేకలన్నావు కాదు!

సరోజ: జరిగిపోయిందేదో జరిగిపోయింది. ఇక జరగవలసిందేమిటో ఆలోచించు.

రాజా: ( తేలికగా ) ఇంకా ఆలోచించడాని కేముంది? అంతా తేలిపోయింది. విలన్‌గాణ్ణి చావతన్ని

మనం ఇద్దరం కలిసి పెళ్లి చేసుకోవడమే తరవాయి.

సరోజ: ( బాధగా కుర్చీలో కూలబడి ) వీల్లేదు రాజా, వీల్లేదు!

రాజా: ( తెల్లబోయి ) ఏమిటి వీల్లేదు?

సరోజ: మనం పెళ్లిచేసుకోడానికి వీల్లేదు.

రాజా: ( నిలదీసి ) అదే ఎందుకు లేదూ? అంటాను.

సరోజ: ( బాధగా గద్గదస్వరంతో ) మాట ఇచ్చాను. చంద్రాన్ని పెళ్లాడతా నని.

రాజా: ( ఆశ్చర్యంతో ) నువ్వా దుర్మార్గుణ్ణి పెళ్లాడతావా? ఎందుకు ఒప్పుకున్నావు?

సరోజ: ( ఆవేశంతో ) వరుడు ప్రతిష్ఠకోసం. కుటుంబగౌరవంకోసం. వంశమర్యాదకోసం.

రాజా: ( వ్యంగంగా ) నువ్వు త్యాగం చేస్తావా?

సరోజ: ( దీనంగా ) తప్పదు రాజా!

రాజా: నువ్వు త్యాగం చేస్తే చెయ్యి. నాకు అభ్యంతరం లేదు. నేనుమాత్రం త్యాగం చెయ్యను! నేను నిన్ను పెళ్లాడి తీరతాను ! ( భీష్మించుకు కూర్చుంటాడు. )

సరోజ: నదు, రాజా! నా మాట విను!

రాజా: వినను! ఎంతమాత్రం వినను! నేను మజునూ లాగ 'ప్రియతమా' అంటూ చావలేను. అందుకు నేను సిద్ధంగా లేను!

సరోజ: ( జాలిగా ) నేను ఈ త్యాగానికి ఎందుకు సిద్ధపడ్డానో నీకు తెలియదు రాజా!

రాజా: అవ్...ను! తెలియదు. తెలుసుకోవలసిన అవసరం అంతకంటే లేదు! నువ్వు ఒప్పుకుంటే సరే సరి! లేకపోతే పెద్దలు చెప్పిన మార్గం ఉండనే ఉంది. రాక్షస వివాహం! నిన్నెత్తుకు పోయి పెళ్లి చేసుకుంటాను. తప్పదు! తప్పదు!

సరోజ: ( బాధగా ) నిన్ను చూస్తే జాలేస్తూంది రాజా!

రాజా: చాలు! చాలు! జాలి ఒక్కటే చాలు! 'గాఢమైన అనురాగానికి తొలిమెట్టు జాలి!' అన్నాడు ఫ్రాయిడ్, మంచిది. మంచిది.

సరోజ: నీమీద నాకు అనురాగం, ప్రేమా అన్నీ ఉన్నాయి రాజా. కానీ మా కుటుంబ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. నీకు తెలియదు.

రాజా: ( నిలదీసి ) ఎలా మారింది? ఎందుకు మారింది?

సరోజ: ( విషాదంగా ) మా ఆస్తి అంతా పోయింది. వ్యాపారంలో నష్టం వచ్చింది. చుట్టూ అప్పులవాళ్లు కూర్చుని ఉన్నారు. మా నాన్నగారి బాధ చూడలేక చంద్రం చేస్తున్న ఆర్థిక సహాయానికి కృతజ్ఞతగా....

రాజా: ( వెంటనే మధ్యలో ) నువ్వు వాణ్ణి పెళ్లాడు తున్నావన్నమాట!

సరోజ: మరో మార్గం లేదు రాజా!

రాజా: ( తీవ్రంగా ) సరోజా, మీ నాన్న సంగతి నీకు తెలియదు. డబ్బుదగ్గిర మీ నాన్నది భల్లూకపు పట్టు. చూస్తూ చూస్తూ లక్షలకొద్దీ ఆస్తి వ్యాపారంలో పోగొట్టుకున్నాడనేది కట్టుకథ. నమ్మడానికి వీల్లేని సంగతి. మీ నాన్న అసలే జిత్తులమారి!

సరోజ: ( కోపంతో బిగ్గరగా ) రాజా!

రాజా: క్షమించు సరోజా! మీ నాన్న గుంటనక్క. జిత్తులమారి. జుత్తులు ముడివేసే బాపతు. దగాకోరు. డబ్బుకోసం గడ్డికరిచే మనిషిపుడు. అసలు మీ నాన్నను వర్ణించాలంటే ఒక సీసపద్యం చాలదు. శతకం రాయాలి! పట్నంలో ఒక కవి ఉన్నాడు. పదహారు రూపాయలిస్తే చాలు. తెల్లారేసరికి శతకం రాసి పారేస్తాడు.

సరోజ: ( ప్రసన్నంగా ) ఏమిటీ! మా నాన్నగారి మీద శతకం రాయిస్తావా?

రాజా: ఓ, దింకా ఎటూయింది రాయిస్తాను! సమస్త మైన ఖర్చులు నేనే భరించి రాయిస్తాను! ఇద్దరు మంత్రులను తీసుకువచ్చి ఆవిష్కరణ మహోత్సవం జరిపిస్తాను!

సరోజ: ఎంత ధైర్యం! నా ఇంటికి వచ్చి నన్నే అవమానిస్తావా?



సరసశృంగారం

చిత్రం — గోలి నాగేశ్వరరావు ( హైదరాబాదు—22 )

రాజా: ( లేచి ఆమెను సమీపించి ) ఇంకా నా ఇల్లూ నీ ఇల్లూ ఏమిటి? మన ఇల్లు అను!

సరోజ: ( అనుమానంతో ) నా ఆస్తిమీద అనురాగంతో వచ్చావా నువ్వు?

రాజా: ఆస్తి లేదని ఇప్పుడే కదా నువ్వు చెప్పావు! దాంతో ఆస్తిమీది అభిమానం నశించింది. ఆ చోట్లో త్యాగం వచ్చి కూర్చుంది. ( పరవశత్వం అభినయిస్తూ ) సరోజా! నీకోసం నేను త్యాగం చేస్తాను! ( బిగ్గరగా ) త్యాగం! నీకోసం మీ ఆస్తిని, చివరికి మీ నాన్ననుకూడా నేను త్యాగం చేస్తాను!

సరోజ: ( ప్రేమతో ) రాజా!

రాజా: ( ఆమెకు మరింత దగ్గిరగా వెళ్లి ) సరోజా, ముందు నువ్వీ దెయ్యం వేషం మార్చెయ్యదూ!

సరోజ: అదంతా తరవాత. ముందు నీకు మర్యాద చెయ్యాలి. రా, నాతో రా.

రాజా: వద్దు! వద్దు! మీ నాన్న వచ్చేసరికి నేను వంటింట్లో కూర్చుంటే కొంప మునుగుతుంది! వద్దూ.... వద్దూ....

( అంటూనే సరోజతో మధ్య ద్వారం లోంచి లోపలికి వెళ్లిపోతాడు. సరోజా, రాజా నిష్క్రమించిన వెంటనే కుడివైపు నుంచి అడుగులో అడుగువేస్తూ చంద్రం, కిష్టయ్య హాల్లో ప్రవేశిస్తారు. చంద్రం మధ్య ద్వారం వరకూ వెళ్లి లోపలికి చూసి, తిరిగి హాలు మధ్యకు వస్తాడు. )

చంద్రం: ( బాధ నొక్కిపెడుతూ ) ఒరేయ్, కిష్టయ్యా!

కిష్టయ్య: అయ్యా!

చంద్రం: ఇప్పుడన్న రాజా వచ్చికూర్చున్నాడు. రావడంటేనూ గుండెలమీద కత్తిలాగ వచ్చాడు.

కిష్టయ్య: మరేం భయంలేదు సార్! మనం ఉన్నాం కత్తికి కత్తి!

చంద్రం: ( కోపంతో ) కత్తికి కత్తి, జుత్తుకు జుత్తు, నెత్తికి నెత్తి. ఏమిటిరా నీ తలకాయ?

కిష్టయ్య: మరేం చేద్దాం అంటారు?

చంద్రం: రాజాగాణ్ణి నెమ్మదిగా ఊరు చివరికి ఎత్తుకుపోవాలి.

కిష్టయ్య: అదెంత పని! నిమిషాలమీద ఎత్తుకుపోతాం!

చంద్రం: డొక్కుకారు ఒకటి సంపాదించాలి!

కిష్టయ్య: అదెందుకు మధ్యని? మనం వెళ్లడానికి మంచి కారే తెచ్చుకుందాం!

చంద్రం: అది కాదురా నాయనా! రాజాని ఊరి చివరికి తీసుకువెళ్లి చిత్రవధ చెయ్యాలి!

కిష్టయ్య: ( భయంతో ) అయ్య బాబోయ్! చిత్రవధే!

మరి.... పోలీసులు రారూ?

చంద్రం: ఎందుకు రారూ? వస్తారు! మనం అంత తెలివితక్కువగా చెయ్యం! మనం రాజాగాణ్ణి చితగ్గొట్టి డొక్కు కారులో పారేసి, కారును కొండలమీదినుంచి దొర్లించెయ్యాలి! అది అప్పుడు ఆక్సిడెంటయిపోతుంది! అప్పుడు పేపర్లన్నీ "ఘోరమైన కారు ప్రమాదం!" అని రాస్తాయి!

కిష్టయ్య: ఆహా ఆహా ఏం తెలివి!

చంద్రం: ఇప్పుడు రాజాను ఊరి చివరికి తీసుకువెళ్ళే మార్గం ఏమిటీ అన్నది పెద్ద ప్రశ్న!

కిష్టయ్య: నిజమే! మన మాట నమ్మి అంత తేలిగ్గా ఊరి చివరికి వస్తాడా?

చంద్రం: రాడు. రాడు.

కిష్టయ్య: మరేమిటి దారి?

చంద్రం: అది నీ చేతిలోనే ఉంది!

కిష్టయ్య: అంటే నేనేం చెయ్యాలి? ఏం చెయ్యాలి?

చంద్రం: నువ్వు రాజా ఒంటరిగా ఉన్నప్పుడు అతని దగ్గిరికి వెళ్ళి 'అయ్యా! మీకోసం పట్నం నుంచి సినిమావాళ్ళు వచ్చారు' అని చెప్పాలి!

కిష్టయ్య: చెప్పినంత తేలిగ్గా నమ్మేస్తాడా అని.

( సరిగా ఆ సమయంలో కుడివైపునుంచి ఇద్దరు వ్యక్తులు వస్తారు. ఒకఅతని చేతిలో హార్మోనియం ఉంటుంది. మరొక అతని చేతిలో తబలా ఉంటుంది. ఇద్దరూ దేన్నీ పట్టించుకోకుండా తమ ధోరణిలో మాట్లాడుకుంటూ వస్తారు. )

రంగ: ( సాఫీగా ) నేను చెప్పింది తప్పంటావా మోహనా?

మోహన: రైటేరా రంగా.

రంగ: అప్పుడు వాడు ఊరుకోవాలంటావా?

మోహన: మరి ఊరుకోవద్దూ?

రంగ: వాడూరుకోలేదే! సవాల్ చేశాడు!

మోహన: ( కోపంతో ) ఏమిటీ? మనమీద సవాల్ చేసే మొనగాడెవడు? ( బిగ్గరగా ) ఎవడు వాడు? ముందుకు రమ్మను!

( ఇంతవరకూ ఆశ్చర్యంగా చూస్తున్న కిష్టయ్య అమాంతంగా ఇద్దరికీ ఎదురు వెళతాడు. )

కిష్టయ్య: ఆగండి! ఆగండి! ఎవరు మీరు? మాటా మంతీ లేకుండా ఇంట్లో చొరబడిపోతున్నారేమిటి? ఇదేమన్నా ధర్మసత్రం అనుకున్నారా?

మోహన: ( నిర్లక్ష్యంగా ) ఈ ఇల్లు రామ్మూర్తిగారిది కాదా?

కిష్టయ్య: అవును. రామ్మూర్తిగారిదే.

రంగ: ( మోహనతో ) అయితే మనం పొరబాటు పడలేదు.

మోహన: మన జీవితంలో పొరబాటే లేదు. అడుగు నిదానించి మరీ వేస్తాం.

రంగ: ( కిష్టయ్యను రాసుకొని ముందుకు వెళ్ళి టేబుల్ మీద తబలా దించి మోహనతో ) చూడూ! ఈ ఎత్తు సరిపోతుందా?

మోహన: ( టేబులు సమీపించి హార్మోనియం టేబులు మీద పెట్టి ) రైట్! రైట్! సరిగ్గా సరిపోతుంది.

రంగ: అయితే ఎక్కేద్దాం టేబిలు.

మోహన: రైట్! రైట్!

( ఇద్దరూ టేబిలు ఎక్కి కూర్చుని, స్తిమితంగా హార్మోనియంకు, తబలాకు ఉన్న కవర్లు తొలగించి శ్రుతి చూస్తూ ఉంటారు. )

కిష్టయ్య: ( బిగ్గరగా ) ఏమండోయ్! ఎవరు మీరు? ఎందుకు వచ్చారు? ఇదంతా మీ సొంత ఇల్లులాగ వాడేసుకుంటున్నారేమిటి?

మోహన: ( ఠీవిగా ) నీదీ నాదీ అన్న భేదం లేనివాడే కళాకారుడు!

రంగ: ( వెంటనే ) ఈ సృష్టిలోని సమస్త వస్తు సముదాయాన్నీ చూసి ఆనందించి అనుభవించే హక్కు ( తబలామీద ఒక్కటి కొట్టి ) ఒక్క కళాకారుడికే ఉంది!

కిష్టయ్య: ( కోపంతో ) మీ రెవరంటే చెప్పరేం?

రంగ: మమ్మల్ని మేం పరిచయం చేసుకోవలసిన అవసరం మాకు లేదు.

మోహన: అలాంటి కర్మ మాకింకా పట్ట లేదు.

రంగ: ( మోహనను చూపిస్తూ ) ఈయన కళాకోవిద, హార్మోనీ ప్రవీణ మోహన.

> ప్రపంచాన్ని భగవంతుడు ఎలా పాలిస్తున్నాడో తెలుసుకొందుకు నేను వార్తా పత్రికలు చదువుతాను.
>
> — జాన్ మ్యాటన్

మోహన: ( రంగను చూపిస్తూ ) ఈయన తబలా ధురీణ, రంగమార్తాండ రంగ!

రంగ: మేం ఇద్దరం కలిసి 'మోహనరంగ!'

మోహన: తనువులు వేరయినా భావాలూ రాగాలూ ఒకటే!

రంగ: సుప్రసిద్ధ సినిమా దర్శకులం!

మోహన: అదే మా కులం!

రంగ: సంగీత దర్శకులకు సినిమాలలో చాలా అన్యాయం జరుగుతూంది.

మోహన: ప్రేక్షకులకూ సంగీత దర్శకులకు మధ్య అడ్డుగా ప్రొడ్యూసర్ నిలబడ్డాడు.

రంగ: తెరమీద నాయికా నాయకులను ప్రేక్షకులు చూస్తారు కాని సంగీత దర్శకులను చూడరు.

మోహన: ఈవిధంగా సంగీత దర్శకులు ప్రేక్షకులకు దూరం అయిపోయారు.

రంగ: ఈ దురన్యాయాన్ని మొదట పసికట్టింది మేమే!

మోహన: మా ప్రయత్నానికి చేయూత ఇచ్చినవాడు నటచక్రవర్తి చక్రవర్తి.

కిష్టయ్య: ( నమ్రతతో ) మీ రిప్పుడు చక్రవర్తికోసం వచ్చారా?

రంగ: అంతే! అంతే!

చంద్రం: ( ఇంతవరకూ కోపంతో చూస్తున్న చంద్రం, కిష్టయ్యతో ) చక్రవర్తి ఎవడు?

కిష్టయ్య: ( పైచేతు చూపిస్తాడు. )



చంద్రం: ( కోపంతో ) ఎవడూ? ఆ రాజాగాడా?

మోహన: చూశావురా రంగా. మన నటసామ్రాట్టును పిల్లు ఎంత చులకనగా చూస్తున్నారో!

రంగ: మన ప్రతిభ తెలిస్తే వీళ్ళే దాసోహం అంటారు.

మోహన: రంగస్థలంపీద మనం ప్రవేశపెట్టబోయే తొలి మార్పు ఇప్పుడే చవిచూపించుదాం!

రంగ: నేటినుంచి సంగీతదర్శకులే రంగస్థలంపీద దర్శనం ఇస్తారు.

మోహన: నాయికా నాయకులు నేపథ్యంలోంచి యుగళగీతం పాడతారు.

రంగ: దానికి ఇదే నాంది. లాగించరా మోహనా!

మోహన: వాయించరా రంగా!

( మోహన జేబులోంచి ఈల తీసి బిగ్గరగా ఊదుతాడు. మోహన హార్మోనియం, రంగ తబలా వాయిస్తూ ఉంటారు. నేపథ్యంలోంచి రాజా, సరోజా పాడుతున్న యుగళగీతం పాట ప్రతిధ్వనించేలా వినిపిస్తూ ఉంటుంది. పాట జరుగుతున్నంతసేపు చంద్రం, కిష్టయ్య కోపంతో, మధ్య గదిలోకి సంగీతదర్శకులకేసి చూస్తూ ఉంటారు. )

నేపథ్యంలో పాట:

రాజా: ఇదేనా? ఇదేనా? సొగసులాడి విరికన్నియ!

సరోజ: ఇదేనా? ఇదేనా? పొగరెక్కిన చిరుతుమ్మెదా!

సరోజ, రాజా: ఇదేనా? ఇదేనా? ఇదే! ఇదే! ఇదేనా?

సరోజ: చిరుగాలికి ఊగి ఊగి నే దూరంగా పోతే,

రాజా: చిరు రెక్కలపై తేలి తేలి నీ దగ్గరకే వస్తా!

సరోజ: నా దరికి రాకు ఓ రాజా!

రాజా: నీ దరికే వస్తా రోజా!

సరోజ: స రి గ వ రి కొసరి కొసరి సరసమేల రాజా?

రాజా: సొగసులాడి సరసచేరి కవ్వించుట ఏలా?

సరోజ: ఓ రాజా! ఒయ్యారి రాజా!

రాజా: రోజా, ఓహోహో నా రోజా!

సరోజ: మగసిరి కలవాడ! సొగసైన చినవాడ!

రాజా: మగసిరికై వేచిఉన్న సొగసరి లలనా!

సరోజ: చూడ చూడ ముచ్చటగును నీ కౌగిలి విడజాల !

రాజా: విడువలేక వదలలేక నిను చేరితినే బాలా!

సరోజ: ఆహా, ఆహా, ఆహా హా హా హా!

రాజా: ఓహో! ఓహో! ఓహో హో హో హో!

సరోజ, రాజా: ఇదేనా! ఇదేనా!

( చివరి చరణం పాడుతున్న సమయంలో చంద్రం కిష్టయ్య సైగలతో మాట్లాడుతూ ఉంటారు. )

చంద్రం: ( "ఏం చేద్దాం?" అన్నట్లు చెయ్యి ఊపుతాడు. )

కిష్టయ్య: ( కుడివైపు చూపిస్తూ "పైకి పోదాం" అని సైగ చేస్తాడు. )

( పాట పూర్తి అయ్యేసరికి చంద్రం, కిష్టయ్య కలిసి కోపంతో బయటకు వెళ్ళిపోతారు. )

రాజా: ( అమాంతంగా మధ్యద్వారంనుంచి ప్రవేశించి ) అద్భుతం! అమోఘం! శ్రస్తాస్త్రములు,

లేకుండా శత్రువులను పలాయితులను చేసిన మీ సంగీత ప్రతిభ మెచ్చుకోదగినది. సంగీత దర్శకులారా! మీ కివే నా కళాభినందనలు!

మోహన: నటరాజా! ఇటు రావయ్యా!

( రాజా టేబులు దగ్గరికి వచ్చి ఇద్దరి మధ్యా నిలబడతాడు. )

రంగ: ఇదేమి అవతారం మహారాజా?

మోహన: సాక్షాత్తూ నటసామ్రాట్టులే!

రంగ: రహి పుట్టు జంత్ర గాత్రముల రాల్కరగించు——

మోహన: విమలగాంధర్వంబు విద్య నీకు.

రాజా: ( నిర్లక్ష్యంగా ) అవ్...ను!

మోహన: అట్టి నీకు ఈ బడిపంతులు బ్రతుకా?

రంగ: బ్రతకలేక బడిపంతులుగా మారడమా?

మోహన: అందులోనూ పరాయిభాష ఇంగ్లీషు చెప్ప డమా?

రంగ: సంగీతం చెప్పడానికి ఒప్పుకోక ఇంగ్లీషుకు ఎందుకు ఒప్పుకున్నావు రాజా?

మోహన: ఆంగ్లభాషలోని ఘనత ఏమిటి?

రాజా: మిత్రులారా దీనికి జవాబు గద్యంతో అనగా వచనంలో చెప్పడానికి వీల్లేదు.

మోహన: అయితే పద్యంలోనే చెప్పు!

( అని జేబులోనుంచి ఈల తీసి ఊది, వెంటనే హార్మోనియం వాయించడం ప్రారంభిస్తాడు. రంగ చేతులు కట్టుకుని కూర్చొంటాడు. )

రాజా: ( రాగంతీసి పద్యం చదువుతాడు. )

సకల కళలయందు సంపన్నుడైనను
విద్యలెన్ని ఉన్న వినయమున్న
తెల్లవారి భాష తెలుసుకోజాలని
వాని తెలివి యిలను తెల్లవారు!

మోహన: ( వెంటనే ) కాబట్టి ఏం చెయ్యాలంటావు?

రాజా: ( పద్యం )

గానశాస్త్ర పారంగతుడైన ఘనుడు
ఆంగ్ల భాషా ప్రవీణుడై తీరవలెను.
లేని చో ప్రభువుల మెప్పు పొందలేక
పూట తిండికి గతిలేక బాధపడును.

మోహన: ( పద్యం )

ప్రభువు అనగ నెవరో వివరింపు మన్న
ప్రభువు పదవికి గొప్ప సద్గుణములెవ్వి?

రాజా: ఇచ్చకాలకు మెచ్చుకోలుకు వశుడగు
నరుడు ప్రభువుకాక పరుడు ప్రభువు కాడు.

రంగ: ( ఉత్సాహం భరించలేక చప్పట్లుకొట్టి ) వన్స్‌మోర్!

మోహన: అద్భుతంగా చెప్పావు. అద్భుతం!

రంగ: ఈ పద్యాలను స్కూలు పుస్తకాల్లో చేర్చవచ్చు.

మోహన: ఉగ్గుపాలతో నేర్చుకోవలసిన నీతి ఇది!

( మధ్యద్వారంలోంచి సరోజ వస్తుంది. అందమైన సిల్కుచీర కట్టింది. కళ్ళు మిరుమిట్లు కొలిపే ఆభరణాలు వేసుకొంది. ముఖం కలకలలాడుతూ ఉంది. ఆమె చేతిలో ట్రే ఉంది. ట్రేలో రెండు కాఫీ కప్పులు ఉన్నాయి. )

రాజా: ( వెంటనే కాఫీ కప్పులు అందుకొని మోహన రంగలకు ఇచ్చి, సగర్వంగా ) ఈమె నా శిష్యురాలు!

రంగ: ( ఆశ్చర్యంతో ) నువ్వు ఈవిడకా చదువు చెబుతున్నావు!

రాజా: ( ఉత్సాహంతో అలితేలిగ్గా ) అవ్‌ను!

మోహన: ఇంత పెద్దావిడకి చదువు చెప్పడమేమిటి?

రంగ: ( వెంటనే ) ఇంకా చిన్నపిల్లలకేమో అనుకున్నాం!

సరోజ: ( కోపంతో ) రాజా! నీ స్నేహితులు నన్ను అవమానిస్తున్నారు. ఎగతాళి చేస్తున్నారు. నేను సహించలేను.

రాజా: ( బతిమాలే ధోరణిలో ) శాంతించు సరోజా. ( మోహన రంగలతో ) సరస్వతీ పుత్రులారా! మిత్రులారా! ఈ సరోజ మీరు అనుకున్నంత పెద్దది కాదు. మొన్ననే ఈమెకు పదహారవ జన్మదినోత్సవం జరిగింది. ( సరోజవేపు తిరిగి ) సరోజా, వీరిద్దరూ సంగీత దర్శకులు. దక్షిణాదిని ఉన్న ఏకైక సంగీత దర్శకుల జంట! సంగీతక్షేత్రంలో వీరిద్దరూ పండించారు అద్భుతమైన పంట! "చెట్టు కింద కొట్టు" పాటకు మట్టుకట్టి హిట్టు చేసింది వీరే!

సరోజ: నమస్కారాలండి!

మోహన, రంగ: ( హుందాగా ) నమస్కారం! నమస్కారం!

మోహన: మనం రంగస్థలంమీదికి దూకే రోజెప్పుడు రాజా?

రాజా: వారం రోజులు ఆగాలి!

రంగ: ఏకంగా వారం రోజులే!

రాజా: అవును. గడువు కావాలి. మిత్రులారా! సంగీత దర్శకులారా! సకాలంలో మీరు వచ్చినందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. ( ఎడమ వైపు చూపిస్తూ ) అదే నా విడిది గృహం. కాదు కాదు గది! దయచేసి మీరిద్దరూ నా గదిలోకి పోయి విశ్రమించ ప్రార్థన!

రంగ: విశ్రమించం! విశ్రమించం!

మోహన: మా ఆశయం తీరేవరకూ మేం విశ్రమించం!

రంగ: చాలు మాకీ విశ్రాంతి! ఏదీ మూడుస్వరాలో ఒక్క పాట!

( మోహన, రంగ ఇద్దరూ తమ ధోరణిలో హార్మోనియం, తబలా వాయిస్తూ ఉంటారు. )

రాజా: ( నిస్పృహతో ) హా! హా! నాకీక అవమాన యోగం తప్పదా?

మోహన: అవమానం కాదు రాజా, సన్మానం!

రంగ: కళాకారులకు సన్మానం జరిగే రోజు అతి సమీపంలో ఉంది.

రాజా: రోజు కాదు, క్షణం! క్షణం! రామ్మూర్తి వచ్చిన ఉత్తరక్షణంలో మన ముగ్గురికీ సన్మానం జరుగుతుంది. కనక దయచేసి తాత్కాలికంగా మీరిద్దరూ నా గదిలో విశ్రమించ ప్రార్థన.

మోహన: ( నిరుత్సాహంతో ) రోజులు తిన్నగా లేనప్పుడు మరేం చేస్తాం! పదరా, రంగా! ( బల్ల దిగి హార్మోనియం చేతోట్టి పట్టుకుంటాడు. )

రంగ: ( నిస్పృహతో ) తప్పుతుందా మరి! నటసామ్రాట్టుకోపమైనా మన ఆనందాన్ని త్యాగం చెయ్యక తప్పదు!

మోహన: తప్పదు! తప్పదు!

( మోహన, రంగ ఇద్దరూ హార్మోనియం తబలాలతో సహా ఎడమవైపు గదిలోకి వెళ్ళిపోతారు. )

సరోజ: ( లాలనగా ) కొంతసేపైనా స్వేచ్ఛగా హాయిగా...

రాజా: ( మాట మధ్యలో ) ఇప్పటికి చాలు, ఈ హాయి!

సరోజ: ఏకాంతంగా మాట్లాడుకోడానికి వీల్లేకుండా వాళ్ళను ఎందుకు తీసుకువచ్చావు రాజా?

రాజా: నీ భాషలో చెప్పాలంటే అదంతా విధివిలాసం తప్పదు.

సరోజ: ( పరిశీలనగా చూస్తూ ) ఇప్పుడు నువ్వు ఎంత అందంగా ఉన్నావు రాజా!

రాజా: ( నిరుత్సాహంతో ) ఎంత అందంగా ఉంటే ఏం లాభం సరోజా? నా ముఖం వెండితెరకు పనికి రాదని కెమేరామేన్ చెప్పేశాడు!

సరోజ: ( పరవశత్వంతో ) ఆహా! నిజంగానా? ఆ కెమేరామేన్ ఎంత మంచివాడు!

రాజా: ( కోపంతో ) ఏమిటే? నా ముఖం తెరకు పనికిరాదని చెప్పినవాడు మంచివాడా?

సరోజ: ( ప్రశాంతస్వరంతో ) అవును రాజా. లేక పోతే నువ్విప్పుడు నాకు కనిపించి ఉండేవాడవు కావుకదా?

( ఆ సమయంలో కుడివైపునుంచి కిష్టయ్య వస్తాడు. )

(సశేషం)

## మా బాబు

ఎల్. జయలక్ష్మి.

జాబిల్లి ఉదయించె నీలగగనాన
మా బాబు ఉదయించె మా యింటిలోన.
చిన్ని పెదవులతోను
చిలిపి మా బాబు
చిరునవ్వు లొలికించు
వెన్నెలీనరంగ.

ఊగులాడుచు చాల
ఊసులాడును బాబు.
ఊహలో బంగారు
ఊయలూగును హాయి.

నింగిలో తారకలు
నిను చూచి నవ్వేను
నిదురించు వేళాయె
నిదురపోవయ్యా! ★